**విలేకరులు కావలెను**

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8


శనివారం 26.04.2025 | సంపుటి: 03 | సంచిక: 109 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్


# పాక్ పౌరుల జాబితా పంపండి

## రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఆదేశం

### అటారీ-వాఘా సరిహద్దుకు పాక్ పర్యాటకులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్25:**

ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయుల కు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ దేశాల మిగతా 2వ పేజీలో..



## సింధు జలాలు ఆపేస్తే మీ ఊపిరి ఆపేస్తాం

- మోడీ లక్ష్యంగా హఫీజ్ ప్రేలాపనలు

**లాహోర్,ఏప్రిల్ 25 :**

పాకిస్థాన్ బేస్డ్ ఉగ్రవాద సంస్థ లష్కర్‌ఇతోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ ముహమ్మద్ సయీద్ కారుకూతలు కూశాడు. పీఎం మోదీ టార్గెట్ గా పిచ్చి ప్రేలాపనలు చేశాడు. సింధు జలాలను ఆపేస్తే, మీా ఊపిరాపేస్తామంటూ ఉన్మాదపే ప్రేలాపనలు పేలాడు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి వెనుక కూడా 26/11 ముంబయి దాడుల మాస్టర్ మైండ్.. హఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు గుర్తించిన సంగతి తెలిసిందే. హఫీజ్ ముహమ్మద్ సయీద్ పాకిస్తానీ తీవ్రవాది. లష్కర్ఇతోయిబా వ్యవస్థాపకుడు. ఈ ఉగ్ర సంస్థ ప్రధానంగా పాకిస్తాన్ నుండి పనిచేస్తోంది.ఈ విభాగానికి తొలినాళ్లలో షేక్ సాజిద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా బాసిత్ అహ్మద్ దార్ వ్యవహరించారు. ఆ తర్వాత నుంచి లష్కరే చీఫ్ హఫీజ్ సయ్యద్ కనుసన్నల్లోనే నడుస్తోంది. డిప్యూటీ హెడ్‌గా సైఫుల్లా వ్యవహరిస్తున్నారు. ఈ ఇరూ పాక్ నుంచే ఎల్ఈటీ కార్యకలాపాలను నడిపిస్తున్నారనే అభియోగాలు ఉన్నాయి. పాక్ సైన్యం, ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ టీఆర్ఎఫ్ గ్రూపులకు సైద్ధాంతికపరమైన మద్దతు మాత్రమే కాదు.. అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నాయని భారత గూఢచార సంస్థలు నిగ్గుతేల్చాయి.



## లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లిల్లీ హతం

**శ్రీనగర్,ఏప్రిల్25 :**

పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ము కశ్మీర్ అంతటా భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టారు. ఉగ్రమూకల కోసం రాష్ట్రమంతటా జల్లెడ పడుతున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లిల్లీని భద్రత బలగాలు మట్టుబెట్టాయి. బందీపొరాలో అల్తాఫ్ ఉన్నట్లు సమాచారం తెలిసింది. దీంతో శుక్రవారం ఉదయం ఆర్మీపోలీసులు జంటగా ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ముందు ఓ ఉగ్రవాది ఈ ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా బలగాల్లో ఓ అధికారికి బులెట్ తగిలింది. ఈ క్రమంలో భద్రతా బలగాలు అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి.



ఇస్రో శాస్త్రవేత్త కస్తూరిరంగన్ కన్నుమూత 2

## సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం



- ఆనాడు కేసీఆర్ ఇక్కడి నుంచే కదిలారు
- యువత ర్యాలీని ప్రారంభించిన హరీశ్ రావు

**సిద్దిపేట,ఏప్రిల్ 25:**

తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి మిగతా 2వ పేజీలో..



జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం 2



## నోవాటెల్‌లో భారత్ సమ్మిట్ ప్రారంభం

- సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఏప్రిల్25 :**

హెచ్ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి మిగతా 2వ పేజీలో..

## పాక్ పౌరులు తక్షణం దేశం విడిచి వెళ్లాలి

- ప్రకటన విడుదల చేసిన డీజీపీ

**హైదరాబాద్,ఏప్రిల్ 25:**



తెలంగాణలో వీసాలతో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని, లేకుంటే చటంటప్రకారం చర్యలు తప్పవని డిజిపి హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దేశం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ..తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్న వారికి ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదు. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాల్సిందే. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అమెరికా కోసమే నానా గడ్డి కరిచాం 2



## దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

- ఉగ్రవాదం తుదముట్టించేందుకు సంఘటిత పోరాటం
- శ్రీనగర్‌లో మీడియాతో రాహుల్

**శ్రీనగర్,ఏప్రిల్ 25 :**

పహల్‌గామ్ ఉగ్ర దాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడిరచేందుకు భారత్ సంఘటితంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతి పక్ష నాయకుడు మిగతా 2వ పేజీలో..

# ఉగ్రదాడిపై అసోం ముస్లిం ఎమ్మెల్యే ప్రేలాపనలు

- దేశద్రోహం కింద అరెస్ట్ చేసిన పోలీసులు

**గౌహతి,ఏప్రిల్25 :**

అసోం ముస్లిం ఎమ్మెల్యే ఒకరు కాశ్మీర్ ఉగ్రదాడిపై పిచ్చికూతలు కూశాడు. దానికి అతడిని వెంటనే అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నాడు. ఉగ్రవాదులకు మద్దుతగా చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారంజరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులపై కాల్పులు జరపగా.. మొత్తంగా 28 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడిని భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. కానీ.. ఈ దాడిపై అస్సాంలో విపక్ష పార్టీ ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లామ్ పాకిస్థాన్‌కు మద్దతు పలికాడు. ప్రస్తుత పెహల్గామ్ ఉగ్రదాడి, అంతకుముందు 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి ఘటనలను ప్రభుత్వ కుట్రలో భాగమేనని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశాడు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎమ్మెల్యే అమినుల్ ఇస్లామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసినట్లుసీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. బీఎన్ఎస్ సెక్షన్లు కింద కేసు నమోదైంది. మరోవైపు.. అమినుల్ వ్యాఖ్యలపై ఏఐయూడీఎఫ్ పార్టీ స్పందించింది. ఇతను చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. ఈ వ్యాఖ్య తన వ్యక్తిగతమని చెప్పుకొచ్చింది. పాకిస్థాన్‌కు వత్తాసు పలుకుతూ మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అస్సాం హిమంత బిశ్వ శర్మ హెచ్చరించారు.

# జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం

- వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు
- బీఆర్ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్,ఏప్రిల్ 25:**

రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టు రావడంతో బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్ఏ వచ్చిందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నాము అని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు..కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం



**మొదటి పేజీ తరువాయి**

రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిరదని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.



# దేశాన్ని చీల్చడమే ఉగ్రవాదుల లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండిరచారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ క్షతగాత్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటున్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్రదాడిని ఖండిరచాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

# అమెరికా కోసమే నానా గడ్డి కరిచాం

- ఉగ్రవాదులను అందుకే పెంచి పోషించాం
- పాక్ రక్షణమంత్రి ఖవాజా సంచలన వ్యాఖ్యలు

**లాహోర్,ఏప్రిల్25 :**



తమ గడ్డపై ఉగ్రవాదులే లేరంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్ ఇప్పుడు అసలు నిజాలను బయటపెట్టింది అమెరికా కోసం అడ్డమైన గడ్డీ కరిచామి పేర్కొంది. ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ నిజమేనంటూ స్వయంగా ఆ దేశ రక్షణమంత్రే అంగీకరించారు. ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు దాయాది దేశం పాక్ ఇంతకాలం దాస్తూ వచ్చిన నిజాలను ప్రపంచానికి చెప్పకనే చెప్పేసింది. ఎలా ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చిందీ అన్న నీచ బుద్ధిని బయటపెట్టాయి. అయితే, అమెరికాకోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ ఆ మంత్రి వ్యాఖ్యానించడం గమనార్హం. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకాలంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి ఖవాజా బదులిస్తూ.. అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడిరది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేదని అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావించారు. అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని అన్నారు. మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లో పాక్ తన బలగాలను పెంచుతున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దులతో పాటు బలోచిస్థాన్‌లో ఉన్న మిలిటరీ సిబ్బందిని నియంత్రణ రేఖ వద్దకు పంపిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అటు జవాన్ల సెలవులను కూడా పాక్ మిలిటరీ రద్దు చేసినట్లు సమాచారం. కొత్త సెలవులను ఆమోదించొద్దని కార్ప్స్ కమాండర్లను ఆదేశించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' హస్తం ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. అయితే ఉగ్రకుట్రలో పాల్గొన్న వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా అభివర్ణించిన ఆయన అభాసు పాలయ్యాడు. ఈ వ్యాఖ్యలపై దేశ, విదేశాల్లో తీవ్రనిరసనలు వచ్చాయి.



# నోవాటెల్‌లో భారత్ సమ్మిట్ ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి**

ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు.

భారత్ సమ్మిట్ 2025 లో డెలిగేట్స్ సదస్సులో సమాచార పౌర సంబంధాలు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపాల్గొన్నారు. ఎంపీ లు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఫీన్ ల్యాండ్, థాయ్ లాండ్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్ ఈ.సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరించారు.

# ఇస్రో శాస్త్రవేత్త కస్తూరిరంగన్ కన్నుమూత

**బెంగళూరు,ఏప్రిల్25:**



ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు. 1990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్ఎసి డైరెక్టర్‌గా పని చేశారు. 1994 నుంచి 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు భారతీయ అంతరీక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఛైర్మన్‌గా సేవలు అందించారు. జెఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 20032009 వరకూ ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. దీంతో పాటు మోదీ సర్కార్ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా రంగన్ పని చేశారు. ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ మీద దేశద్రోహం ఆరోపణలు వచ్చినప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా ఉంది కస్తూరి రంగనే. 1969లో ఆయన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడిరచారు. కస్తూరిరంగన్ 19901994 వరకు యూఆర్ఎసీ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్ల పాటు (19942003) ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 200309 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు.

# ముగిసిన చంద్రమౌళి అంత్యక్రియలు

- అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు
- ఉగ్రవాద చర్యలను తుదముట్టించాలన్న హోంమంత్రి

**విశాఖపట్టణం,ఏప్రిల్ 25 :**

పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖ వాసి చంద్రమౌళి అంతిమయాత్రలో హోంమంత్రి అనిత, మంత్రి సత్యకుమార్, కూటమి నేతలు పాల్గొని నివాళులర్పించారు. ఉగ్రవాదుల చర్యను పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండిరచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 25 మంది భారతీయులు కాగా, ఒకరు నేపాల్‌కి చెందిన వ్యక్తి. ఈ దాడిలో 25 మంది భారతీయులలో ఇద్దరు తెలుగు వ్యక్తులు కూడా ఉన్నారు. నెల్లూరులోని కావలికి చెందిన మధుసూదన్ రావు, విశాఖపట్నానికి చెందిన చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండగా ఉంటుందని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. విశాఖపట్నానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రమౌళి కుటుంబం ఈ ఘటనను తలచుకుని తీవ్రంగా విలపించింది. మంత్రి వారిని ఓదార్చి, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని ధైర్యం చెప్పారు. పహల్గామ్ ఘటనపై మాట్లాడుతూ... ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఇది అని, టెర్రరిజానికి మతం లేదన్నారు. కానీ.. పహల్గామ్ ఘటనలో మాత్రం హిందువులను టార్గెట్ చేసి చంపారన్నారు. కల్మా చదవమన్నారని, రాదని చెప్పిన వారిని మోకాళ్లపై కూర్చోబెట్టి బుల్లెట్లు దింపారని బాధితులు చెబుతుంటే బాధాకరంగా అనిపించిదని ఆయన తెలిపారు. అమానుషంగా చంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తమ బాధను తను చెప్పుకున్నప్పుడు నోటివెంట మాటలు రాలేదని ఆయన అన్నారు. ఇది అందరి బాధ్యత అని, ఇది పూర్తి ఖండిచాల్సిన విషయమన్నారు. పార్టీలకు అతీతంగా ఈ మారణ హోమాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు.

# కస్తూరి రంగన్ సేవలు నిరుపమానం

- నివాళి అర్పించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్25 :**



ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలు అందించారని ఆయన గుర్తు చేసుకున్నారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో చైర్మన్‌గా, ముఖ్యంగా పిఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఆయన పోషించిన పాత్ర దేశం మరిచిపోదని సిఎం పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, జేఎన్యూ వైస్ ఛాన్స్‌లర్‌గా, కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా అనేక పదవుల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ కస్తూరి రంగన్ మృతి దేశానికి లోటని, ఒక గొప్ప ఖగోళ శాస్త్రవేత్తను దేశం కోల్పోయిందని సిఎం రేవంత్ పేర్కొన్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని సిఎం రేవంత్ ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతిని తెలియజేశారు.

# మంత్రి పొంగులేటి పీఏల పేరుతో వసూళ్లు

- ఇదదరిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్25:**

ఈజీమనీకి అలవాటు పడి సైబర్ మోసాలకు పాల్పడే వారు కొందరైతే.. మరికొందరేమో పొలిటికల్ లీడర్స్ ను అడ్డం పెట్టుకుని సంపాదించాలని చూస్తుంటారు. తప్పు చేస్తే ఎప్పటికైనా దొరకాల్సిందే కదా.. ఇదే రీతిలో ఇద్దరు వ్యక్తులు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్సనల్ అసిస్టెంట్స్ మంటూ అమాయకులను మోసం చేస్తున్నారు. చివరికి వీరి బాగోతం బట్టబయలు కావడంతో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ (పిఎ) ల మని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి 34), మచ్చ సురేష్ (30) హైదరాబాద్ నాగోల్‌ల నివాసముంటున్నారు. వీరు మంత్రిగారి పీఏ మంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన మంత్రి దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాద చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు ఇక నుంచి తన పీఏలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివా యంలోని తన కార్యాలయం 0402345107 /04023451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాద చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజల కు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు.

# పాక్ పౌరుల జాబితా పంపండి

**మొదటి పేజీ తరువాయి**



మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. దాంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన స్వయంగా ఫోన్ చేసి.. వారికి ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మీ మీ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని సూచించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ తగిన ఆధారాలను సేకరించింది. అందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన విదేశీ కార్యదర్శులకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ అందజేశారు. మరోవైపు భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు 48 గంటల లోపు దేశం విడిచివెళ్లాలంటూ ఆదేశించింది. దీంతో ఇప్పటికే భారత్‌లో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు.. స్వదేశం వెళ్లేందుకు అటారీ సరిహద్దు వద్ద క్యూ కట్టారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పాకిస్థానీయులను సైతం భారత్‌ను పంపేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. అందులోభాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి.. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై కేంద్రం సీరియస్ అయింది. అందులోభాగంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులకు జారీ చేసిన వీసా గడువు ఏప్రిల్ 27వ తేదీతో ముగిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ లోపు వారంతా దేశం వీడి వెళ్లవలసి ఉంటుందని పేర్కొంది. దీంతో భారత్‌లో పర్యటిస్తున్న అనేక మంది పాకిస్థాన్ జాతీయులు పంజాబ్‌లోని అటారీ వాఘా సరిహద్దు ద్వారా తమ దేశానికి తిరిగి ప్రయాణమయ్యారు. తమ బంధువులను కలుసుకునేందుక తాము 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చావ ని వారు పేర్కొన్నారు. అంతేకాదు.. ఈ ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో అటారీవాఘా సరిహద్దున అధికారులు మూసివేసిన విషయం విదితమే. అలా న్యూఢల్లీలోని పాకిస్థాన్ రాయబారీ కార్యాలయంల ని దౌత్యవేత్తతోపాటు మిగిలిన అధికారులు దేశం వీడి వెళ్లాలని ఆదేశించింది. అందుకోసం వారికి వారం రోజుల గడువు విధించింది. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణిం చారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలను నిలిపివేసింది. అలాగే అటారీ సరిహద్దును మూసి వేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమైంది. దాదాపు గంటల పాటు జరిగిన ఈ భేటీలో కీలక నిర్ణయాల తీసుకొంది.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శనివారం
ఏప్రిల్ 24, 2025
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# పాక్ ఎప్పుడూ పక్కలో బల్లెమే !



భారత్‌లో ఉగ్రదాడులు జరినప్పుడల్లా పాక్ బుకాయింపులతో కాలక్షేపం చేస్తుంది. తనకు సంబంధం లేదని చెబుతుంది. ఉగ్రవాదులకు మాదేశంలో స్థానం లేదని చెప్పడం కూడా అలవాటు చేసుకుంది. ముంబై ఉగ్రదాడుల సమయంలోనూ ఇదే చెప్పింది. అలాగే అజ్మల్ కసబ్ గురించి వివరాలు చెప్పినా కసబ్ మా దేశస్థుడు కాదని బొంకింది. చివరకు కసబ్ పుట్టుపూర్వోత్తరాలు బయటపడ్డాక కూడా అదే పాట పడిరది. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడితో తమకు సంబంధం లేదని పేర్కొంది. మరి ఢల్లీలోని పాక్ రాయబాబరి కార్యాలయంలో కేక్ సంబరాలపై ఆ దేశం స్పందించాల్సి ఉంది. ముష్కరులకు పాక్ పూర్తి మద్దతు ఇస్తోందన్న వాదనకు కేక్ వ్యవహారం పక్కా రుజువుగా నిలిచింది. ఇవన్నీ మరచిపోయి బలూచిస్థాన్ ఘటనలను భారత్‌కు అంటగట్టే ప్రయత్నం చేసి చేతులు కాల్చుకుంది. మనం టెర్రరిస్టుల జాబితా సమర్పించినా, వారు పాక్‌లో తిష్టవేసుకుని వున్నా వారిని మాత్రం అప్పగించడం లేదు. హాఫీజ్ సయీద్ లాంటి ఉగ్రవాదులను దాచిపెడుతోంది. వారికి పాలుపోసి పెంచుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే దాడి తరవాత పాక్ నాయకులు చేస్తున్న ప్రకటనలు ఆ దేశ కుత్సితాన్ని బయటపెడుతున్నాయి. దాడులను ఏనాడు పాక్ ఖండిరచడం లేదు. ఆధారాలు చూపితే చర్యలు తీసుకోవడం లేదు. సరికదా తాజాగా కూడా పాక్ నేతల ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతమించ్చేలా, పాక్ అండదండలతో వ్యవహారం నడిచినట్లుగా కనిపిస్తోంది. నిజానికి మత ప్రాతిపదికన భారత్‌ను చీల్చుకుని ఏర్పడ్డ పాక్ పాలకులు ఏనాడూ నిజాయితీగా లేరు. భారత్‌ను వర్గశత్రువుగా చూపించి పబ్బం గడుపుకోవడం, కాశ్మీర్ బూచి చూపి ప్రజలను వశపర్చుకోవడం తప్ప..ఆ దేశం సర్వ నాశనం అయినా వారికి పట్టింపు లేదు. ఇదంతా నాటి భాతర పాలకులు చేసిన దుర్మార్గపు రాజకీయ క్రీనీడ కారణంగా మనకు సంక్రమించిన రావణకాష్టంగా చెప్పుకోవాలి. దీనికి ఎక్కడో ఓ చోట మందు పెట్టాలి. వ్రణం తీవ్రమయితే కాలు తీసేయాల్సిందే. పాక్ కాల్లూచేతులు విరిచేందుకు వెనకాడరాదు. ఇకపోతే పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ టెర్రరిస్టుల విషయంలో దాయాది పాక్ దేశ అసలు రంగు ఇప్పుడు బయటపడిరది. బయటకు మాత్రం పహల్గాం టెర్రరిస్ట్ దాడితో మాకు సంబంధం లేదని సుద్దాపూస మాటలు మాట్లాడి.. దాడిని ఖండిరచింది. కానీ పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలతో వారి నిజస్వరూపం బట్టబయలైంది. 28 మంది అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా ఊచకోత కోసిన నరరూప రాక్షసులను పాక్ డిప్యూటీ పీఎం ఇషాక్ దార్ స్వాతంత్య సమరయోధులతో పోల్చాడు. ఆయన వ్యాఖ్యలతో పాక్ వక్రబుద్ధి ప్రపంచదేశాల ముందు మరోసారి తేటతెల్లమైంది. పహల్గాం ఘటనపై ఇషాక్ దార్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ జిల్లాలో దాడులు చేసిన వారు స్వాతంత్య సమరయోధులు అని అభివర్ణించారు. భారత్ సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంపైన కూడా తనకు తోచిన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో 240 మిలియన్ల మందికి సింధు నది నీరు అవసరం. మీరు ఆ ఒప్పందాన్ని ఆపలేరు. ఒకవేళ ఇండస్ ట్రీటీ- రద్దు చేస్తే అది యుద్ధ చర్యకు సమానం అని హెచ్చరించారు.ఆ దేశం కూడా అదే విధమైన ప్రతిచర్యను ఎదుర్కొంటుందని అన్నారు. 28 మందిని మానవత్వం లేకుండా మట్టుబెట్టిన ఉగ్రవాదులను పాక్ ప్రధాని ఏకంగా స్వాతంత్ర సమరయోధులతో పోల్చడంపై భారత ప్రజలు భగ్గుమంటున్నారు. ఇదే పాక్ అసలైన బుద్ధి అని విమర్శిస్తున్నారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. పర్యాటకులను మతం ఆధారంగా పరిశీలించి, అడిగి మరీ ఉగ్రమూకలు విచక్షణరహితంగా కాల్పులు జరిపాయి.ముష్కరుల పాశవిక దాడిలో 26మంది

అమాయక ప్రజలు మృతి చెందగా.. మరికొందరు పర్యాటకులు బుల్లెట్ గాయాలకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భారత దళాలు జమ్మూ కాశ్మీర్‌ను అణువణువునా శోధిస్తున్నారు. అందరూ నిరాయుధులు.. సామాన్యులు..తమను విడిచిపెట్టాలని బతిమలాడినా ఉగ్రమూకలు పట్టించుకోలేదు. తలకు తూపాకీ గురిపెట్టి అత్యంత కర్కశంగా వారిని కడతేర్చారంటే ఎంతటి మత దురహంకారులో అర్థం చేసుకోవాలి. . కశ్మీర్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఈ దాడి వెనక లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు సైపుల్లా..ఉగ్రమూకలను అమాయకుల మీద ఊసిగొల్పారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎల్‌ఈటీకి అనుబంధంగా ఉన్న కరుడుగట్టిక ఉగ్రవాదుల బృందం బైసరన్‌లో నిర్ధాక్షిణ్యంగా 26 మంది అమాయకులను మట్టుపెట్టింది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఈ బృందంలో ప్రధానంగా విదేశీ ఉగ్రవాదులు ఉంటారు. వీరికి స్థానిక మిలిటెంట్లు తోపాటు కశ్మీర్‌లో మద్దతుదారులు మరికొందరు పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. పాక్ ప్రభుత్వ మద్దతుతో హాఫీజ్ సయీద్, అతడి ముఖ్య అనుచరులు ఈ ఉగ్రమూకలకు నేరుగా సహాయపడి ఉండొచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఎప్పుడైనా టెర్రరిస్టులు పాక్ నుంచే వస్తుంటారు. పాక్ నుంచే శిక్షణ పొందుతారు. పాక్ వారిని ఉసిగొల్పుతుంది. కనుక మనం తీసుకునే చర్యలు ప్రపంచం కూడా హర్షించేలా.. పాక్ నడ్డివిరిచేలా ఉండాలి. పాక్ ఇక జన్మలో కోలుకోకుండా చేయాలి. దెబ్బకొడితే జీవితాతంతం మరచిపోకుండా చేయాలి. అప్పుడే మనకు ఈ ఉగ్రదాడుల బెడద ఉండదు. అయితే ఎంతసేపు ఎవరు దాడిచేస్తారో అన్న అప్రమత్తతో పాటు ఉగ్రవాదుల ఏరివేతలో ఇజ్రాయిల్ సహకారం తీసుకుంటే మంచిది.

# రూ.5 కోట్లిస్తారా.. వీడియో బయటపెట్టాలా

## జుక్కల్ ఎమ్మెల్యే కు యూట్యూబర్ బెదిరింపులు

**జుక్కల్, ఏప్రిల్ 25(ప్రజాశంఖారావం):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును బ్లాక్ మెయిల్ చేసిన యూట్యూబ్ చానల్ రిపోర్టర్ మేనం శ్యామ్, దండానియ నిరూప అనే మహిళను రాజేం ద్రనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్కు తరలించారు. పోలీసుల ప్రకారం.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు రాజేంద్రనగర్ సన్ సిటీలో నివాసం ఉంటున్నారు. రెండు వారాల క్రితం 'ప్రజా వాయిస్ న్యూస్ ఛానల్' పేరుతో మేనం శ్యామ్ అనే వ్యక్తి కాల్ చేశాడు. తనను తాను జర్నలిస్ట్ గా పరిచయం చేసుకున్నాడు.. ఈ నెల 15న కలిసేందుకు అపాయింట్మెం ట్ ఇవ్వాలని కోరాడు. అదే రోజు సాయంత్రం 7.30 గంటలకు నిరూప, మరికొందరితో కలిసి మేనం శ్యామ్ హైదరూడలోని ఎమ్మె ల్యేక్వార్టర్స్ కు వచ్చాడు. లక్ష్మీకాంతరావు వ్యక్తి గత వీడియోలు తమ వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడ్తామని నిందితులు బెదిరించారు. వాటిని తమ యూట్యూబ్ ఛానల్లో ప్రసారంచేయకుండా ఉండాలంటే రూ.5 కోట్లు ఇవ్వాల ని డిమాండ్ చేశారు. పొలిటికల్ కెరీర్ నాశనం అవుతుదంటూ బ్లాక్ మెయిల్ చేశారు.. శ్యామ్, నిరూప వేధింపులు పెరిగిపోవడంతో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మంగళవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి.. శ్యామ్, నిరూపను గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి ల్యాప్టాప్లు, డెస్క్ టాప్ లు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో నింది తులను చంచల్గూడ జైలుకు తరలించారు.



## నియంత్రణ రేఖ వద్ద ఉద్రిక్తతలు కాల్పులకు తెగబడ్డ పాక్ బలగాలు

**శ్రీనగర్,ఏప్రిల్ 25 :**

జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. పాకిస్థాన్ దళాలు.. భారత్ పోస్టులపై కాల్పులకు తెగబడ్డాయి. దీంతో అప్రమత్తం అయిన భద్రతా బలగాలు తీవ్రంగా తిప్పికొట్టాయి. పాక్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నాయి. తాజా కాల్పుల నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఎల్‌ఓసీ దగ్గరకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆర్మీ చీఫ్ కాశ్మీర్ పర్యటనలో ఉండగా పాక్ ఈ దుస్సాహసానికి ఒడిగట్టింది. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే సింధు జలాలను నిలిపివేసింది. అలాగే పాక్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా పాక్ బోర్డర్‌ను నిలిపివేయడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంది. భారత్ తీసుకుంటున్న పరిణామాలతో పాక్ భయాందోళనకు గురవుతోంది. దీంతో భారత్‌పై కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అందుకు తగ్గట్టు-గా భారత్ కూడా తిప్పికొట్టేందుకు సిద్ధపడుతంది. మంగళవారం పహల్గామ్ ఉగ్ర దాడిలో దాదాపు 26 మంది చనిపోగా.. పదుల కొద్దీ గాయాలు పాలయ్యారు. ఇక మృతదేహాలను ఆయా ప్రాంతాలకు అధికారులు తరలించారు. ఈ దాడిలో 5-6 ఉగ్రవాదులు పాల్గొన్నట్టుగా తెలుస్తోంది. ఈ ముష్కరులకు స్థానికులు కూడా సపోర్ట్ చేసినట్లు- వార్తలు వినిపిస్తున్నాయి.

### పాక్ హ్యాకర్ల పన్నాగం

న్యూఢిల్లీ, ఏప్రిల్25 :పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే ప్రయత్నంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. సింధు జలాల సరఫరాను కూడా నిలిపివేసింది. భారత్ తీసుకునే నిర్ణయాలతో పాకిస్తాన్ అతలాకుతలం అవుతోంది. అయితే ఇంత జరుగుతున్నా పాకిస్తాన్‌కు మాత్రం బుద్ధిరావటం లేదు. పాడు పనులు చేస్తూనే ఉంది. పాకిస్తాన్‌కు చెందిన కొందరు హ్యాకర్లు .. ఆర్మీకి చెందిన కాలేజీ వెబ్ సైట్‌ను హ్యాక్ చేశారు. ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం.. ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ-కి చెందిన ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వెబ్ సైట్‌ను పాకిస్తాన్‌కు చెందినట్లు-గా భావిస్తున్న కొందరు హ్యాకర్లు హ్యాక్ చేశారు. అంతేకాదు.. ' యూ ఆర్ హ్యాక్డ్ ' అంటూ వెబ్ సైట్ హోం పేజీలో ఓ మెసేజ్‌ను కూడా వదిలారు.

# కాంగ్రెస్‌ను, మోడీని ప్రశ్నిస్తూనే ఉంటాం

**నిజామాబాద్,ఏప్రిల్25 :**

**హామీలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం**
**ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

వరంగల్ రజతోత్సవ సభో కాంగ్రెస్, బిజెపిల హామిలను వారి మోసాలను నిలదీస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్ పాలన, మోడీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాలన్నదే తమ లక్ష్యమని వేముల అన్నారు. వ్యవసాయానికి కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అందించలేక పోతున్నదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి గ్యాస్ రాయితీ తగ్గించి.. ఎరువులు, యూరియా ధరలు పెంచిందన్నారు. భాజపా సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రమూ బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో భ్రమపెట్టడం అలవాటు చేసుకున్నారని అన్నారు. రైతురాజ్యం రావాలని, దీనికోసం అందరూ కలిసిరావాలని కెసిఆర్ ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు మళ్లీ చర్చ మొదలయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తెలంగాణలో రైతులకు ఇప్పుడు కష్టం వచ్చి పడిరదని అన్నారు. గతంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా నీటి తీరువా లేదు. విద్యుత్తు చార్జీలు లేవు. ధాన్యం కూడా ప్రభుత్వమే కొన్నది. ఆనాడు రైతులు కెసిఆర్‌ను ఎంతగా ఆదరించారో చూస్తే తెలిసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌పై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామిలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్న తీరును నిలదీయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఏడాదిన్నర దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.ఎన్నిసార్లు అబద్దాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. పసుపుబోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. వరంగల్ సభతో ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తామని అన్నారు.



# కాందహార్ హైజాక్ నుంచి క్రమంగా దాడులు

## పాక్ లో తిష్టవేసి మాస్టర్ ప్లాన్స్ వేస్తున్న టెర్రర్ గ్రూపులు హాఫీజ్ సయీద్ ఇందులో మాస్టర్ మైండ్

న్యూఢిల్లీ,ఏప్రిల్25 : కాందహార్ విమానం హైజాక్ ఘటనను ఏ భారతీయుడు మరచిపోడు. నేపాల్ వెళ్లిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేయించి, జైలు నుంచి విడుదలయిన ఉగ్రవాదులంతా పాక్‌లోనే ఉన్నారు. వారే తదుపరి అనేక టెరరర్ దాడులకు మూలకారకులు. ముంబై మారణకాండ లాంటి ఘటనలకు కారకుడైన హాఫీజ్ సయీద్.. టెర్రరిస్టులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి పోషిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఈ టెర్రరిస్టు బృందం కశ్మీర్ లోయలో క్రియాశీలకంగా ఉన్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతేడాది సోనమార్గ్, బూతాపత్రీ, గండేర్బల్ దాడుల్లో ఈ బృందమే పాలుపంచుకుంది. గత అక్టోబర్‌లో బూతాపత్రిలో జరిగిన దాడిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు సహా మొత్తం నలుగురు మృతి చెందారు. అదే నెలలో సోనామార్గ్ టెన్నెల్ కార్మికులను టార్గెట్ చేస్తూ జరిగిన దాడిలో ఆరుగురు కార్మికులతో పాటు ఓ డాక్టర్ కూడా కన్నుమూశారు. అయితే, గత డిసెంబర్‌లో ఈ టెర్రరిస్టు బృందానికి చెందిన జునైద్ అహ్మద్ భట్ అనే లష్కర్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుపెట్టాయి. మిగిలిన వారు ఎలాగోలా తప్పించుకుని, సమీప అడవుల్లోకి పారిపోయారు. భారీ దాడి చేశాక ఈ ఉగ్రమూకలు అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోతాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థానీ హ్యాండర్ల నుంచి తదుపరి ఆదేశాలు అందే వరకూ అక్కడి అడవుల్లోనే తలదాచుకుంటారని తెలిపాయి. తాజా దాడిలో పాల్గొన్న ఊగ్రవాదులు ఎల్‌ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్‌తో పాటు అతడి ముఖ్య అనుచరుడు నియంత్రణలోని వారే అని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. వీరికి పాక్ మిలిటరీతో పాటు ఐఎస్ఐ నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. బైసరన్ లోయలో మూడు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న ఉగ్రమూకలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. పోలీసుల కథనాల ప్రకారం, ఓ ప్రాంతంలో ఐదు మందిని, మరో మైదాన ప్రాంతంలో ఇద్దరిని, లోయ సరిహద్దు వద్ద మిగతా వారిని ఉగ్రవాదులు బలి తీసుకున్నారు. ఫెన్సింగ్ దాటి పారిపోగలిగిన వారు ఈ దాడి నుంచి తప్పించుకోగలిగారు. మరోవైపు, దాడికి పాల్పడిన వారి రేఖాచిత్రాలను జమ్మూ కశ్మీర్ పోలీసులు విడుదల చేశారు. వీరి లో ఇద్దరు పాకిస్థానీలు కాగా మరొకరు స్థానిక అనంత్‌నాగ్ జిల్లా వాస్తవ్యుడు. నిందితుల ఆచూకీ చెప్పిన వారికి రూ.20 లక్షల నజరానాను కూడా పోలీసులు ప్రకటించారు. సమీప అడవుల్లో ఉగ్రవాదులు తలదాచుకున్న స్థావరాలను గురువారం భద్రతా దళాలు గుర్తించాయి. వారి జాడ కనిపెట్టేందుకు భద్రతా దళాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయి. భౌతికమైన దాడులే కాకుండా పాక్ గుండెను దెబ్బతీసేలా చర్యలకు భారత్ పూనుకుంది. సింధునదీ జలాల నిలిపివేత ఇందులో ప్రధానమైనదని చెప్పాలి. ఎందుకంటే జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రసంస్థ టీఆర్‌ఎఫ్ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది టూరిస్టుల మరణించారు. దీంతో ప్రజలు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అరేబియా సముద్రంలోకి భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రవేశించింది. ఇది ప్రస్తుతం పాకిస్తాన్ దిశలో ఉంది. భారత నేవీ సీ స్కిమ్మింగ్ టార్గెట్లను ఖచ్చితంగా ఛేదించే పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించింది. ఇదిలా ఉంటే, మరోవైపు భారత వైమానిక దళం తన కీలకమైన సైనిక విన్యాసాలను చేపట్టింది. ఎక్సర్సైజ్ ఆక్రమన్ పేరు భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. గురువారం సెంట్రల్ సెక్టార్‌లో పెద్ద ఎత్తన వార్ గేమ్ ఎక్సర్సైజ్ నిర్వహించింది. పర్వతాలు, భూతల లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యాలపై దృష్టి పెట్టింది. ఈ ఎక్సర్సైజ్‌లో రాఫెల్ యుద్ధ వివానాలు పాల్గొన్నాయి. ఇందులో లాంగ్ రేంజ్ దాడులు, శత్రు స్థావరాలపైన దాడుల వంటి వాటిని నిర్వహించాయి. వైమానిక దళాని చెందిన కీల క ఆస్తులు పలు వైమానిక స్థావరాల నుం చి తూర్పు వైపుగా తరలించినట్లు తెలు స్తోంది.పంజాబ్ అంబాలాలో, పశ్చిమ బెం గాల్ హషిమారాలో వైమానిక దళం రెండు రాఫెల్ స్క్వాడ్రన్లను మోహరించింది



# ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**హైదరాబాద్ ,ఏప్రిల్ 25:**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ ముక్తకంఠంతో నినదిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పాక్ పై దౌత్యపరమైన దాడికి తెరలేపింది. దేశం మొత్తం పాక్ కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తోంది. ముష్కరుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఎంపి ఒవైసీ, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్, ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.. ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పర్యాటకులపై దాడి చేసి చంపడం తీవ్రమైన ఘటన.. అందరం ఒక్కటై తీవ్రవాదంపై పోరాడాలి.. భారత ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు మద్దతు ఇవ్వాల్సిన సమయం ఇది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలి.. పార్టీలకు అతీతంగా పని చేయాలి.. తీవ్రవాదాన్ని అంతం చేయాలని సీఎం తెలిపారు.

## కేసీఆర్ కుటుంబం కోసమే వరంగల్‌లో సభ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** కెసిఆర్ కుటుంబం కోసమే వరంగల్ లో సభ నిర్వహిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర నాయకుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆరోపించారుశుక్రవారం నగరంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ పగ్గాలా కోసం కేటీఆర్ కవిత తీవ్రంగా పోటీ పడుతున్నారని టిఆర్ఎస్ కేవలం కేటీఆర్ కవిత కోసమే పనిచేస్తుందన్నారు దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అవినీతి బి ఆర్ఎస్ ప్రభుత్వం హయములోజరిగిందన్నారు లిక్కర్ స్కాం లో జైలుకు వెళ్లిన కవిత ప్రత్యక్ష ఉదారణగా చెప్పవచ్చున్నారు ప్రస్తుతం వరంగల్ లో నిర్వహిస్తున్న సభ ఎవరి కోసం చెప్పాలని ప్రశ్నించారు టిఆర్ఎస్కు ఈ చివరి రోజులు అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి బిజెపి నాయకులు మటన్ కార్ లక్ష్మీనారాయణ నారాయణ యాదవ్ విజయ్ కుమార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుందలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన



**జుక్కల్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ఉగ్రవాదుల దాడిలో భారతీయులు ప్రాణాలు కోల్పోయారు ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా శుక్రవారం బిచ్కుందలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలతో నమాజ్ కు వెళ్లి చనిపోయిన వారికి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మన దేశ శాంతి, ఏకత్వాన్ని బలహీన పరచడానికి విదేశీ శక్తులు, ఉగ్రవాదులు కుట్రలు పన్నుతున్నారు మనమందరం ఏకమై విదేశీ శక్తులకు తగిన గుణపాఠం చెప్పాలి. ప్రభుత్వం ఈ శక్తులకు తగిన గుణపాఠం నేర్పిస్తుంది మన మందరం ప్రభుత్వానికి అండగా నిలబడదామని ముస్లింలు పిలుపునిచ్చారు.

## జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

**కామారెడ్డి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి పురస్కారాలు -2025 కు ప్రకటించిన జాతీయ స్థాయి పురస్కారానికి కామారెడ్డి రక్తదాతల సమూహ వ్యవస్థాపకుడు,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ఎంపిక కావడం జరిగిందని ఆదివారం నాడు గోదావరిఖనిలో అందుకోవడం జరుగుతుంది. ఈ అవార్డుకు ఎంపిక చేసిన సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని వారి కోసం మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 2500 ల యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజే యడం జరిగిందని ఈ సేవను గురించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకొని దేశంలోనే మొదటి సంస్థగా కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ లు సంయుక్తంగా నిలవడం జరిగిందని అన్నారు. ఈ పురస్కారం ఆదుకోవడానికి సహకరించ రక్తదాతలకు మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు

## పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటా


**కామారెడ్డి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



ప్రహరీ గోడ నిర్మించుడు ఆపకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని చిదుగు హేమలత ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు మాట్లాడారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2 వ వార్డు రామేశ్వర పల్లి గ్రామ శివారులో సర్వే 85 లో నిర్మల సొసైటీ ఆఫ్ ఫ్రాన్సిస్కాన్ క్లారిస్ట్ సిస్టర్స్ జీవధాన్ కాన్వెంట్ వారు మా భూమిలో ఒక ఎకరం 28 గుంటల భూమినీ కబ్జా చేస్తున్నా రని చిదుగు హేమలత పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చిదుగు హేమలత మీడియాతో మాట్లాడుతూ సర్వేనెంబర్ 85 లో నిర్మల సొసైటీ ఫ్రాన్స్ సిస్టర్స్ జీవధాన్ కాన్వెంట్ వారు మా భూమిలో ఒక ఎకరం 28 గంటల భూమిని కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, వారు ప్రహరీ గోడ నిర్మించినప్పుడల్లా మేము అడ్డుకోవడం జరుగుతుందని, గత 35 రోజులుగా ప్రహరి గోడ నిర్మిస్తుంటే అడ్డుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఆరు సార్లు అడ్డుకోవడం జరిగిందని, మున్సిపల్ నుండి రెండుసార్లు జీవదన్ కాన్వెంట్ వారికి నోటీసులు పంపడం జరిగిందని, అయినా కూడా వారు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాభూమిలో నిర్మల సొసై టీ జీవదన్ వారు నిర్మిస్తున్నటువంటి ప్రహరీ గోడ వెంటనే నిలిపివేయాలని లేక పోతే ఇక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్, ఆర్డిఓ, జిల్లా ఎస్పీ , జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని నాకు న్యాయం చేయాలని అన్నారు. ఒకవేళ పని ఆపకపోతే తాను ఆత్మహత్య చేసుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని అన్నారు.

## రోడ్లపై ధాన్యం పోయొద్దు

**గజ్వేల్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



రోడ్ల పై ధాన్యం కుప్పలు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోతున్నారని, సాధ్యమైనంత వరకు రైతులు రోడ్ల పై ధాన్యం పోయారాదని గజ్వేల్ సిఐ బి సైదా సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ సిఐ సైదా మీడియాతో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదానికి గురవతున్నారని తెలిపారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

### కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం బిచ్కుంద మండల కేంద్రం లోని కే.జయశ్రీ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. తాను, తన భర్త కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించు కుంటున్నామని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనీ కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం ఉన్న షెడ్ లో నివసిస్తున్నామని, తన కున్న ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల రూపాయలతో పాటు ఇతర మార్గాల ద్వారా ఇల్లు నిర్మించుకుంటానని ఆమే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఇతర సిబ్బంది ఉన్నారు.

**ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి..**

రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం గాంధారి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్లు జరిగిన వాటి వివ రాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, డిసిఓ రామ్ మోహన్, తహసీల్దార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రతో వరంగల్ సభకు..



**సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** ఈ నెల 27 వ తేదీన జరిగే మన గులాబి జెండా పుట్టి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గులాబి జెండా పండుగ బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సిద్ధిపేట నియేజకవర్గ విద్యర్థి విభాగం చలో వరంగల్ సభ పాదయాత్రను మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం జెండా ఊపి పాద యాత్రను ప్రారంభించారు .వెయ్యి మంది విద్యార్థు నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు తెలిపారు ." కోట్ల గొంతు కలను ఏకం చేసిన, సిద్దిపేట మట్టిలో విం బూసిన, కెసీఆర్ పోరాటానికి పిడికిలెత్తిన జెండా. హరీషన్న నినదించిన స్వరాష్ట్ర జెండా. తెలంగాణ ప్రజల గుండెల్లో కొలువైన గులా బీ జెండా రాజోత్సవ సభకు ప్రతి తెలం గాణ బిడ్డలము కదులుదాము. లక్షలాది మంది తరలి వెళ్ళి కెసిఆర్ సభను విజవంతం చేద్దాం అని అన్నరు.సిద్దిపేట లోని రంగ దాంపల్లి స్థూపం నుంచి ఎల్కతుర్తి వరకు మూడు రోజుల పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్స రాలు నిండిన సందర్భంగా 25 మీటర్ల జెండాను ప్రదార్శన చేశారు. ఈ విద్యార్థి విభగా పాదయాత్ర కాంగ్రెస్ పార్టీ కి చెంపు పెట్టు అని హరీష్ రావు తెలిపారు. అన్నాడు రావణుని అంతం చేయడానికి రామ దండు ఎలాగైతే కదిలిందో ,ఈ రోజు ఈ రేవంత్ రెడ్డి అరాచకాలను అనచడానికి బి ఆర్ ఎస్ యువత దండు కదిలిందని తెలిపారు.

## దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

### జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** జమ్మూ కాశ్మీర్ లో ని పహల్గాంలో టూరిస్టుల పై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దారుణం చాలా బాధాకరమైన విషయమని ఇలాంటి దారుణానికి కులం మతంతో ఎలాంటి సం బంధం లేదని ఇలాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని జమాతే ఇస్లామి హింద్ రామవరం రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీలోని మస్జిద్ ఎ ఖుబాలో శుక్రవారం ప్రత్యేక నమాజ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్ లో అల్లాహ్ ఒక మనిషి ప్రాణాన్ని తీయడం యావత్ మానవాళి ప్రాణం తీసినట్లు అని ఒక మనిషి ప్రాణం కాపాడితే యావత్ మానవాళి ప్రాణం కాపాడినట్లు అని హితబోధ చేశాడన్నారు. హింస ద్వారా పేరు ధర్మాన్ని అణుచడం అత్యంత హేయమైన చర్య అని కూడా దైవం సెలవిచ్చాడని పేర్కొన్నారు. తన చేతల ద్వారా చూపుల ద్వారా ఆలోచన ద్వారా ఎవరికైనా నష్టం కష్టం కలిగిస్తే మీరు విశ్వాసులే కాదని చెప్పడం జరిగిందన్నారు. ద్వేషించే వారిని ప్రేమించమని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారని పేర్కొన్నారు. మంచి చెడు ఒకటి కాదు చెడును అతి శ్రేష్టమైన మంచి ద్వారా తొల గించు నీ ప్రాణ శత్రువు సైతం నీ ప్రాణ స్నేహితులు అయిపోవడం మీరు గమనిస్తారని ఖురాన్ బోధిస్తుందన్నారు. అమాయకులను చంపమని ఇస్లాం ఏనాడూ ప్రోత్సాహించదని అన్నారు. ప్రతి మతం మంచిని మానవత్వాన్ని చాటి చెప్పుతుందన్నారు. ముక్కు పచ్చలారని వధువుతో పాటు అమాయకులైన వారిని పొట్టన పెట్టుకున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మేరుగైన వైద్యం అందించాలన్నారు. స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలికి కులమతాల మధ్య శాంతి సామరస్యం కోసం కృషి చేయాలని ఉగ్రవాదానికి మతానికి ఎలాంటి సంబంధం ఉండదన్నారు. మస్జిద్ ఇమామ్, షబ్బీర్, రజాక్, సోను బాయ్, అజ్హర్, రఫీ, ఆలం, షమీం పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి

### - మెయిన్ గేట్ ముందు నిరసన




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** తెలంగాణ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని పి డి ఎస్ యూ 7 వ రోజు నిరవదిక సమ్మెకు మద్దతు తెలిపి యూనివర్సిటీ మెయిన్ గేట్ ముందు ధర్నా నిర్వహించరూ. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా 12 యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ సేవలను అందిస్తున్నారని, రెగ్యులర్ రిక్రూట్మెంట్లో మొదట కాంట్రాక్ట్ అధ్యాపకులను తీసుకొని మిగతా పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తే.యూ పి డి ఎస్ యూ నాయ కులు అక్షయ్, రామకృష్ణ, యశ్వంత్, హను మండ్లు, మనోజ్, భీమేశ్, ఆకాష్,అర్జున్ మరియు కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** నిజామాబాద్ జిల్లా జడ్జిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జిల్లా న్యాయమూర్తి జీ.వీ.ఎన్.భరతలక్ష్మిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ఆమెకు పూల మొక్కను అందించి స్వాగతం తెలియజేశారు. ఇరువురు కొద్దిసేపు భేటీ అయ్యి జిల్లా స్థితిగతులపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ అన్నారు.

## జామ మసీద్ ముందు నిరసన

**చేగుంట, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** మెదక్ జిల్లా చేగుంట మండలం, జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో పహాల్గాన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చేగుంట మండల మైనార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని జామ మసీదు వద్ద కమిటీ అధ్యక్షులు (సదర్ )ఆధ్వర్యంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పట్టణ మైనారిటీ నాయకులు,( పజలు పాల్గొన్నారు, ఈ సందర్బంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ భారత దేశంలో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఉగ్రవాదులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని ప్రభుత్వం పట్టుకొని కఠినంగా శిక్షించాలని అన్నారు. దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షకీల్, రహీముద్దీన్, అలీ, అన్వర్, జలీల్, అజీం, నయీమ్, హుసేని, ఇలియాస్, జమీల్, ఖలీల్ ఆరిఫ్,తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే భూ భారతి

## నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**సిరికొండ, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో భూభారతి కొత్త చట్టం పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఏదైనా బు సమస్య ఉంటే ప్రభు త్వం దృష్టికి తీసుకురావాలని, భూమిలో ఏదైనా మార్పులు గాని చేర్పులు గానీ ఉంటే తెలియజేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలనైనా పరిష్క రించడానికి ఈ నూతన భూభారతి చట్టాన్ని రూపొం దించిందని అన్నారు. ధరణి స్థానంలో భూభారతి చట్టం తీసుకొచ్చిందని, పొందుపరిచిన రికార్డులలో ఏదైనా తప్పుగా నమోదైతే సవరించే ఆకాశం ఉందని, రిజిస్ట్రేషన్ మ్యుటెషన్ చేయడానికి ముందు భూమి సర్వే మ్యాప్ తయారు చేయడం, పెండింగులో వున్న సాదా బైనామ దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూముల మ్యుటేషన్ చేసే క్రమంలో ఏదైనా తప్పులు జరిగితే దానిని రద్దు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. భూ సమస్య పరిష్కరించడానికి రెండు అంచల అప్పీల్ వ్యవస్థ, భూములకు హక్కుల రికార్డు, ప్రభుత్వ అసైన్మెంట్, ఎండో మెంట్, వాక్ఫ భూముల పట్టాలు పొందుతే రద్దు చేసే అధికారం కూడా ఎమ్మార్వో, ఆర్డివో లకు ఉంటుంద న్నారు. రైతుల మేలు కోసం ప్రజా పాలనలో భూభారతి చారిత్రక మార్పనీ ఈ యొక్క అంశాల గురించి వ్యవ సాయ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అందాన్, జాయింట్ కలెక్టర్, ఇన్చార్జి ఆర్డిఓ స్రవంతి, తహసిల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, రైతులు, మహిళలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## కూలీలకు షీ టీంపై అవగాహన సదస్సు



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** మంచిర్యాల జిల్లాలోని టేకుమట్ల గ్రామశివారులో జరుగుతున్న 100 రోజుల పని కూలీలకు షీ టీం సభ్యులు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ... ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించేది షి టీం కర్తవ్యం అని, ప్రతి ఒక్కరు వారి పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలపాలని, మహిళలు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అలాగే సైబర్ నేరాల గురించి తెలిపారు. వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి సంబంధిత విభాగాలకు సమాచారం అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. ఆకతాయిల నుండి మరి ఏ ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేయాలనుకుంటే 6303923700 నెంబర్ సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100 కి ఫిర్యాదు చేయాలన్నారు, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిల్డ్ ఆఫీసర్, గుమాస మల్లేష్ షీ టీం సభ్యులు జ్యోతి, శ్రీలత, భరోసా సెంటర్ సబ్ ఆర్డినేటర్ పుష్పాలత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బేస్ బాల్ విజేతగా నిజామాబాద్ పైరేట్స్



**సిరికొండ, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని సత్యశోదక్ పాఠశాల విద్యార్థులు ఈ నెల 21 నుండి 24 వరకు జరిగిన మేజర్ లీగ్ బేస్ బాల్ అండర్ 11 ఛాంపియన్ షిప్ పోటీలలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు) విజేతగా నిలిచి ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకోవడ మైనదని ప్రిన్సిపల్ ఆర్ నర్సయ్య తెలిపారు. రీజినల్ స్థాయిలో లిగ్ దశలో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ ) జట్టుతో పాటు 12 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్లో నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్ జట్టు) తొర్లికొండ జట్టుపై ఘన విజయం సాధించి ఛాంఎయన్లు గా నిలిచి మేజర్ లీగ్ బేస్ బాల్ కప్ ఇండియా హెడ్ ఇంచార్జ్ జపాన్ కు చెందిన మిస్టర్ రియో చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. సత్యశోధక్ పాఠశాల జట్టులో పాఠశాలకు చెందిన నరేందర్, శ్రీహిత్ రెడ్డి, శ్రీకాంత్, శరత్ చంద్ర, తిరుపతి, సాత్విక్, జశ్వంత్, మనోజ్, హేమంత్, శ్రీవర్ధన్, రిత్విక్, సాయి సృజన్ లు సభ్యులుగా, పాఠశాల పి.ఈ.టి. ఉపాధ్యాయులు బాదావత్ సంతోష్, దండు అనిల్ లు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జూన్ మొదటి వారంలో జరగనున్న జాతీయ మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా కప్ -2025 పోటీలకు నిజామాబాద్ పైరేట్స్ (సత్యశోధక్) జట్టును ఎంపిక చేశారన్నారు. నిజామాబాద్ రీజినల్ లీగ్ బేస్ బాల్ అండర్11 విభాగంలో సత్యశోధక్ పాఠశాల జట్టు ఛాంపియన్ గా నిలవడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్త పరుస్తూ జట్టు విజయానికి కృషి చేసిన పాఠశాల క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను, సహకారం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## భూ భారతితో వివాదాలు పరిష్కారం

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**జుక్కల్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం భూభారతి చట్టంతో రైతుల భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం జుక్కల్, బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ...భూభారతి ఆర్ఆర్ 2025 చట్టం కింద భూములకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఈనెల తరబడి పెండింగ్ లో ఉన్న పనులన్నీ భూభారతి పోర్టల్ ద్వారా పరిష్కరించుకోవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పనులు ఉండదని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజ లకు, రైతులకు అవగాహన సదస్సుల నిర్వహిస్తున్నామని తెలిపారు. ధరణీ స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకొచినట్లు పేర్కొన్నారు. తహశీల్దార్ లు వ్యవసా యాధికారులు, మద్నూర్ ఎఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్, బిచ్కుద ఏఎంసీ చైర్మన్ కవిత ప్రభాకర్ రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరం విజయవంతం



**చేగుంట, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** మెదక్ జిల్లా, ఖాజాపూర్ తండా, చిన్న శంకరంపేట్ మండలం లొ విషన్ మరియు సానీక్ష ఫౌండేషన్ సౌజన్యంతో ఉచితంగా హెల్త్ చెకప్ చేసి అవసరం వున్నా వారికి మం దులు ఉచితంగా పంపిణి చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరం లొ 170 మంది వరకు పాల్గొన్నారు. యం ర్ ఐ, సీట్ స్కాన్, కంటి ఆపరేషన్ అవసరం వున్నా వారికి సోమవారం రోజున మల్లారెడ్డి హాస్పిటల్ వారు ఉచితంగా పంపించే బస్ లొ వెళ్లి హైదరాబాద్ లోని మల్లారెడ్డి ఆసుపత్రి లొ ఉచితంగా టెస్ట్ లు, అవసరం వున్నా వారికి ఆపరేషన్ ఉచితంగా చేయించడం జరుగుతుంది అని ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రవి కుమార్ తెలియజేశారు. ఖాజాపూర్ తండా లొ ఉచితంగా క్యాంపు వేసి అందరికి మందులు పంపిణి చేసిన మల్లారెడ్డి హాస్పిటల్ బృందం వారికి హృదయపూర్వక ధన్యవాదాలు ఇలానే ప్రతి గ్రామం లొ ఉచితంగా వైద్యం అందేలా కృషి చేసి గ్రామీణులకు అండగా నిలబడెలా కృషి చేయాలనీ డా డి శివ మల్లారెడ్డి హాస్పిటల్ బ్రాందానికి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖాజాపూర్ తండా సెక్రటరీ వెంకటేష్ కోర్డినేటర్ రవి కుమార్, సాయి, డాక్టర్ భాగ్య సాయి, డాక్టర్ మౌశిక్ రెడ్డి, సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు డా డి శివ, విషన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సంజీవ్, ఫీల్డ్ ఆఫీస్ రవి, ఫార్మసిస్ట్ సబితా, గాయత్రి, శంకర్ నాయక్, నరేష్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్‌లో నివాళి



**రాయికల్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** కుల,మత ప్రాంతం బేధం లేకుండా అన్నదమ్ముళ్ల కలిసి మెలుగుతున్న భారత దేశంలో మతం పేరుతో మరణ హెూమం సృష్టించాలనుకోవడం అవివేకం . సామాన్యులను చుట్టుముట్టి ఆటావికంగా హత్య చేసి గెలిచామనుకోవడం అసమర్థుల చర్య అక్కడ ఆగిన ఊపిరి ప్రతి భారతీయుల్లోని ఉద్రేకం రగిల్చింది. జమ్ము కాశ్మీర్ లోని అనంత్నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై పాకిస్తాన్ ముష్కరుల ఉగ్రవాదులు తుపాకులతో విచక్షణారహితంగా దాడి చేయడాన్ని రాయికల్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంగడి బజార్ లో ఘటనను తీవ్రంగా ఖండిస్తూ యాత్రికులకు కన్నీటిని వాళ్ళు నడిపించడం జరిగింది ఈ ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ ముస్లిం ప్రజలు పాల్గొనడం జరిగింది

## చిన్నారికి బాసటగా నిలిచిన హరీష్ రావు

**సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో విద్యార్థిని ఆవేదన విన్న హరీష్ రావు సభా వేదిక పైనే కన్నీరు మున్నీరయ్యారు. అధైర్య పడవద్దని తాను అండగా ఉంటానని తల్లి, బిడ్డలకు భరోసా ఇచ్చారు. అన్న మాట ప్రకారం నేడు ఆ తల్లి బిడ్డలను సిద్దిపేట క్యాంప్ ఆఫీసుకు పిలుచుకున్నారు. ఆప్యా యంగా పలకరిస్తూ వారితో కలిసి టిఫిన్ చేశారు. చిన్నారి ఆవేదన విని కరిగిపోయిన వ్యాపార వేత్త తిరుమల్ రెడ్డి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రాగా, 2లక్షల చెక్కును హరీష్ రావు తన చేతుల మీదుగా తల్లి, బిడ్డలకు అందించారు. ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్న ఆ వ్యక్తిని హరీష్ రావు ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారి భవిష్యత్తుకు తాను భరోసాగా ఉంటానని ఆవేదన చెందవద్దని హరీష్ రావు హామీ ఇచ్చారు.

భద్రంగా ఉండండి.. భవిష్యత్ లో ఎదగాలి అనే కార్యక్రమం లో సిద్దిపేట పట్టణానికి చెం దిన నాగరాజు విజయ దంపతుల కూతరు సాత్విక స్ప్రింగ్ డైల్స్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని సంవత్సరం క్రితం తన తండ్రి ని కోల్పోయింది.. అమ్మ నాన్న ల గురించి కార్యక్రమం లో వివరించే సమయం చిన్నారి సాత్విక స్టేజి మీదకు వచ్చి నాకు నాన్న లేదు.. నేను అమ్మను ఎప్పుడు ఇబ్బంది పెడుతున్న ఏడుస్తు... దుఃఖం వెళ్ళబుచ్చింది, దానితో అక్కడే ఉన్న హరీష్ రావు.. " తండ్రి ని కోల్పోయి తల్లిని ఇబ్బంది పెడుతున్న అనే తన ఆవేదన తో చెప్పడం హరీష్ రావు మనసును కదిలిచించింది. ఒక్కసారే కన్నీటి పర్యంతం అయ్యారు. చిన్నారి ని దగ్గరికి పిలిచి ఆత్మీయంగా ముచ్చటించారు. తన బాగోగులు తెలుసుకున్నారు. మీటింగ్ జరిగే సమయం లోనే హరీష్ రావు మిత్రుని సహాయం తో



హైదరాబాద్ కు చెందిన వ్యాపార వేత్త తిరుమల్ రెడ్డి చిన్నారి కుటుంబానికి అండగ ఉంటానని, నా వంతు గా 2లక్షలు సహాయం చేస్తా అని హరీష్ రావు తో ఫోన్ లో చెప్పారు. ఈ సందర్భంగా 25 వ తేదీన నా క్యాంపు కార్యాలయం లో టిఫిన్ కి రావాలని చిన్నారిని, తల్లిని హరీష్ రావు ఫోన్ లో మాట్లాడి కోరారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు శుక్రవారం ఉదయం క్యాంప్ కార్యాలయం లో వారితో కలసి టిఫిన్ చేశారు. వారి పరిస్థితి అడిగి తెల్సుకున్నారు. మంచి గా చదవాలి.. భవిష్యత్ లో ఎదగాలి అని మంచి ఉద్యోగం సంపాదించి మి అమ్మను మంచిగా చూసుకోవాలి చెప్పారు. 2లక్షల చెక్ ను తల్లి కి చిన్నారికి అందజేశారు..అమ్మను కష్ట పెట్టొద్దు..అమ్మ ప్రేమ గొప్పది..నువ్ మంచిగా చదవడమే అమ్మకు ఇచ్చే గొప్ప సంతోషం అని చెప్పారు. భవిష్యత్ లో చదువుకు అయిన ఇంక ఇబ్బంది లు ఉన్న నేను అండగా ఉంటా నని భరోసానిచ్చారు.

## చేగుంట యూత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




**చేగుంట, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):** మెదక్ జిల్లా, చేగుంట మండలం గురువారం రాత్రి చేగుంట యూత్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద పహాల్గంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వత్తులు వెలిగించారు. ప్రజలపై ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. కొవ్వత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో విష్ణు, ప్రవీణ్, ప్రకాష్, సురేష్, రాజు, నరేష్, శ్రీకాంత్, సతీష్, ఆంజనేయులు, వేణు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న వ్యక్తి మృతి


**చేగుంట, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట మండలం , తేదీ 24.0 4 .2025 నాడు మధ్యాహ్నం అందాజా ఒకటిన్నర గంటల సమయమున మృతుడు దూదేకుల గఫర్ తండ్రి మదర్ సాబ్, వయస్సు 40 సంవత్సరములు ,కులము ముస్లిం , వృత్తి కూలి పని, నివాసము దొంగల ధర్మారం గ్రామము, రామయంపేట మండలం, మెదక్ జిల్లా గారు తన అన్న బైకు పై పులిమామిడి నుండి దౌల్తాబాద్ కు వెళ్లి డీజిల్ తీసుకొని ధర్మారం వస్తుండగా మార్గమధ్యలో పులిమామిడి గ్రామ శివారులో మూల మలుపు వద్దకు రాగ తన యొక్క బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్టుకు ఢీకొనగా మృతునికి మూతికి ముక్కుకు చాతికి బలమైన రక్త గాయాలు కాగా అంబులెన్స్ లో రామ యంపేట ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ గారు పరీక్షించి అప్పటికే చనిపోయినాడు అని తెలిపినాడు ఇట్టి విషయంలో మృతుని భార్య అయిన దూదేకుల సల్మా వయసు 39, ఫిర్యాదు మేరకు జి చైతన్య కుమార్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చేగుంట పిఎస్ పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినైది.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

**సిరికొండ, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



నిజామాబాద్ జిల్లా పొత్నూర్ గ్రామానికి చెందిన పేర్క సాగర్ మృతి. సిరికొండ ఎస్ఐ ఎల్.రామ్ అందించిన వివరాల ప్రకారం పొత్నూర్ గ్రామానికి చెందిన పేర్క సాగర్ నిన్న 24-4%-%2025 గురువారం రోజు ఇంట్లో నుండి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళినాడనీ, ఈరోజు తేదీ 25%-04-%2025 శుక్రవారం నాడు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో చిన్న వాల్గోట్ గ్రామ శివారులోని రోండ్ల పెద్ద లింగయ్య వ్యవసాయ పొలంలో నీ బావిలో కాల కృత్యాలు నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ భూమిలోని బావిలో కాలు జారిపడి మరణించాడనీ అతని భార్య పేర్క సాగర్ భార్య ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసామని సిరికొండ ఎస్సై ఎల్ రామ్ ప్రకటనలో తెలిపారు.

## డాగ్ స్క్వాడ్ తనిఖీలు



**ఆర్మూర్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
పట్టణ కేంద్రంలో ని ఆర్టీసీ కొత్త బస్టాండ్ లో శుక్రవారం రోజు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మత్తు పానీయాలు, డ్రగ్స్, తదితర వాటిని తరలిస్తున్నారని సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్టు ఆర్మూర్ స్టేషన్ తెలిపారు.

## ఆత్మ రక్షణ కోసం కరాటే దోహద పడుతుంది

**ఎడపల్లి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
ఎడపల్లి మండలకేంద్రంలోని శ్రీ మాధవి పాఠశాలలో కరాటే మాస్టర్ షేక్ ఖయ్యూం సమ్మర్ క్యాంప్ ను ప్రారంభించారు..అనంతరం కరాటేలో శిక్షణ పొంది నైపుణ్యం సాధించిన వారితో ప్రదర్శనలు చేసి చూపించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ 45 రోజుల పాటు ఈ కరాటే క్యాంప్ కొనసాగుతుందని అన్నారు. పిల్లలలో ఫిట్నెస్ ను పెంచడానికి, ఆపదలో వారిని వారు రక్షించుకోవడానికి, కరాటే చాలా ఉపయోగపడుతుందని అన్నారు..ప్రతిరోజు సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి గలవారు ఈ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి సురేష్, కరాటే మాస్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టండి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
పని గంటల పెంపుదాలను కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తిప్పి కొట్టండి అని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ పిలుపునిచ్చారు శుక్రవారం నగరంలోని కోటగల్లీలో ఎన్ ఆర్ భవన్లు139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించరు ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవన భద్రత లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న జిల్లా నాయకులు కిషన్, సాయన్న, రవి, సాయిబాబా, భాస్కరస్వామి, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## తీవ్రవాద సంస్థలకు పౌరులు బుద్ధి చెప్పాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
భారత దేశంలో పర్యటక కేంద్రంగా ఉన్న జమ్ము కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదులు తరుపున కాల్పులకు నిరసనగా నిజామాబాద్ వాకర్స్ యోగ అసోసియేషన్ ఆఫ్ తిలక్ గార్డెన్ అధ్యక్ష కార్యదర్శులు టి గంగాధర్ ఎడ్ల ధనరాజ్ లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రజా స్వామ్యంలో ఎంతో స్వచ్ఛంగా బతుకుతున్న ప్రజలను ఇబ్బంది పెడుతున్న తీవ్రవాద సంస్థలపై భారత దేశ పౌరులు తగిన బుద్ధి చెప్పాలని వారు అన్నారు. వాకర్స్ యోగ అసోసియేషన్ ఆఫ్ తిలక్ గార్డెన్ కోశాధికారి పెంటన్న దయానంద్ కిష్టన్న మదన్ మోతిలాల్ రమేష్ సాయన్న విజయ్ కుమార్ కుసురుస్ హందన్ భాయ్ రావుపోద్దిన్ ముంతాజ్ ఆఫ్టర్ విశ్వనాథ్ శంకర్ నాగోజి సుధాకర్ ఆకాష్ గంగాధర్ తో పాటు సీనియర్ సిటిజెన్లు పాల్గొన్నారు

## దోమల నివారణే మనందరి లక్ష్యం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ మ్ ను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా స్థాయి ర్యాలీ నీ నిజాంబాద్ పట్టణంలోని స్థానిక దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని దుబ్బ ప్రాంత వీధుల్లో ప్రపంచ మల రియా దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం దుబ్బా పట్టణ ఆరోగ్య కేంద్రం యందు అవగా హన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం హెచ్ ఓ మాట్లాడారు. వైద్యాధికారినిలు డాక్టర్ శ్రీలత ,డాక్టర్ సుసేన, డాక్టర్ శిఖరా, డాక్టర్ చంద్రకళ, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మలేరియా అధి, కారి మహమ్మద్ సలీం, సబ్ యూనిట్ అధికారి గోవర్ధన్, హెచ్ ఇ ఓ లు నటరాజ్, సంతోష్, లింగారెడ్డి, నాగరాజు, ఆరోగ్య పర్య వేక్షకులు శాంతా కుమారి, స్వామి, మధుసూదన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# అమాయకులను బలి తీసుకోవడం పిరికిపంద చర్య

### సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
జమ్మూ కాశ్మీర్ లోని పల్గాలో పర్యటకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య అన్నారు జమ్మూ కాశ్మీర్ లోని పహాల్గంలో విహార యాత్ర పర్యటకులపై పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని తుపాకులతో కాల్చి చంపడాన్ని ఖండిస్తూ శుక్రవారం డిచిపల్లి మండల కేంద్రం లోని ఘనపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ముందు నిరసన తెలి పారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ విహారయాత్రకు వెళ్లినటువంటి అమాయక ప్రజలపై టెర్రరిస్టులు తుపాకులతో దాడి చేసి 26 మందిని అన్యం పుణ్యం ఎరుగని అమాయక ప్రజల్ని బలి తీసుకోవడం పిరికిపంద చర్యగా అభివర్ణిస్తున్నాము. దమ్ము ధైర్యం లేని వారు దొంగచాటుగా వచ్చి యాత్రికులపై దాడి చేయడం శోచనీయం,హిందువులని నిర్ధారించుకొని చంపడం క్రూరమైన చర్య, ఈ దాడి జరగడానికి నిఘా వైఫల్యం కారణ భద్రత బలగలా నిర్లక్ష్య మూలంగా దాడులు జరిన్నాయి కావున కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిషా వెంటనే రాజీనామా చేయాలనీ వరన్నారు. టెర్రరిజంతో ఏ దేశం అభివృద్ధి జరిగిన చరిత్ర లేదని అన్నారు. టెర్రరిజని పెంచి పోషస్తున్న పాకిస్తాన్ ఈరోజు అక్కడ ప్రజలకు కనీస నిత్య అవసరాలు తీర్చలేని పరిస్థితికి ప్రభుత్వం నెట్టబడ్డ దని అన్నారు. నిత్యవసర వస్తువు ధరలు ఆకాశానికి అంటినాయి ఎక్కడైతే టెర్రరిజం ఉంటుందో ఆ దేశాలు అభివృద్ధికి అమడ దూరంలో ఉండిపోతాయని అన్నారు. ఒక మనిషిని మరొక మనిషి హత్య చేసే విధానం ఏ మత గ్రంథంలో కూడా లేదని అన్నారు. ప్రాణం పోసే అధి కారం లేనప్పుడు ప్రాణం తీసే అధికారం ఎవరికి లేదని ఇటువంటి చర్యలు చేపట్టడం మూరు?లు చేసే పని అని అన్నారు. దమ్ము ధైర్యం ఉన్నటువంటి టెర్రరిస్టులు మా దేశ సైనికులతో యుద్ధానికి సిద్ధం ఉండాలని డిమాండ్ చేశారు.చాటు మార్గాన వచ్చి ముకుమ్మడిగా దాడి చేయ డం పిరికిపందలు చేసే చర్యాని అన్నారు 26 మందిని పొట్టన పెట్టుకొని మీరు ఏమి సాధించారని ప్రశ్నిం చారు. పాకిస్తాన్ సరిహద్దుల్లో కట్టుదిట్ట మైన చర్యలు తీసుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు నిఘా వ్యవస్థను మరిం త పటిష్ట చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యైడెమోక్రసి డిచిపల్లి మండల కార్యదర్శి గంగా ధర్, పిఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్య దర్శి సుప్రియ, పివై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వాసరి సాయి నాథ్, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డెశెట్టి సాయ రెడ్డి, శైలజ, అరుణ్, సంజయ్, తిరుపతి, సుదర్శన్, మహేందర్, సాయిలు, శ్రీకర్, హరికేశవ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగిన పార్ట్ టైం అధ్యాపకుల సమ్మె



**కామారెడ్డి/ భిక్కనూర్, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
తమ ఉన్నత డిగ్రీలైనా పీహెచ్డీ, నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) , సెట్ (స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్) లను ప్రదర్శిస్తూ శుక్రవారం తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలోని పార్ట్ టైం అధ్యాపకులు నాలుగవ రోజు నిరవధిక సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్ట్ టైం అసోసియేషన్ అధ్యాపకులు మాట్లా డారు. తాము అనేక కష్టాలను పడి దేశం, రాష్ట్రంలోనే ఉన్నత చదువులైన పీహెచ్డీ, నెట్, సెట్ లను సాధించామని తెలిపారు. అంతే కాకుండా వివిధ రంగాల్లో పరిశోనలు చేసి ఉన్నత అర్హతలను పొందమని అన్నారు. యూనివర్సిటీల వారు నిర్వహించిన అన్ని రకాల పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తాము పార్ట్ టైం అధ్యాపకులుగా వివిధ విభాగాలలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం తమ సేవలను గుర్తించలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అనగా ఉద్యోగ భద్రత, మిని మం టైం స్కేల్ అమలు, నియామకాలలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి రేవంత్ రెడ్డి సర్కార్ మాట నిలబెట్టు కోవాలని వారు డిమాండ్ చేశారు. వారికి యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు సైతం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

## గర్భిణులు మంచి పోషకాహారం తినాలి

**- సిడిపిఓ స్వరూప రాణి**



**చేగుంట, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
మెదక్ జిల్లా, చేగుంట మండలం, గర్భిణీ స్త్రీలు బాలింతలు మంచి పోషకాహారం తినాలని రామంపేట సిడిపిఓ స్వరూప రాణి అన్నారు. శుక్రవారం రోజు చేగుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ అంగన్వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భేటీ బచావో బేటి పడావో పోషక వారో త్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్వరూప రాణి మాట్లాడుతూ గర్భిణీ దాల్చిన సమయం నుండి పిల్లలు పుట్టి ఆరు నెలల వరకు ప్రభుత్వం అన్ని విధాల మంచి పూజాకాహారాన్ని అందిస్తుందని ప్రతి ఒక్కరు తీసుకో వాలని తెలిపారు. గర్భిణీలకు,బాలింతలకు,కిషోర బాలికలకు ఈ కార్యక్రమంలో పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ షైనీ సవర్ణ, ఏపీవో శ్వేత,జీ ఎం ఆర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేష్ లు ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, పోషక ఆహారం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు

## ఉగ్రవాద దాడులపై అప్రమత్తంగా ఉండాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
జమ్ము కాశ్మీర్ లోని పహాల్గావ్ వ్యాలీలో ఉగ్రవాదుల కాల్పుల సంఘటనలో చనిపోయిన పర్యాటకులకు నివాళి అర్పిస్తూ సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కోటగల్లి లోని ఎన్ ఆర్ భవన్ నుండి గాయత్రి చౌరస్తా - భగత్ సింగ్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. అనంతరం ప్రాణాలు కోల్పోయిన వారికి భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ మత ఘర్షణలే ఎన్నికల పెట్టుబడిగా చూస్తున్న పాలకుల విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, న్యూడెమోక్రసీ నాయకులు సాయి రెడ్డి ,మల్లికార్జున్ ,శివకుమార్ ,సత్యము, రమేష్ ,అరుణా, గంగాధర్ భారతి, లక్ష్మి ,సంజన ,మోహన్, నర్సింగ్ రావు, భాస్కర్ ,నతన్యల్ తదితరులు పాల్గొన్నారు.

## తులం బంగారం అడిగిన 33 మందిపై కేసు

### బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**
మహిళల పెన్షన్ తులం బంగారం అరిగితే లాడ్చారు చేసి 33 మందిపై కేసులు పెట్టారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమయంలో ఆయన మాట్లాడుతూ హామీలను నెరవేర్చక రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ను ఆగమాగం చేశాడని ఆయన అన్నారు కేసీఆర్ ఆయంలో రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే మొదటి స్థానం లో ఉండేదని రేవంత్ రెడ్డి 500 రోజుల్లోనే దాన్ని 11వ స్థానానికి చేర్చడాని దుయ్యబ ట్టారు. కెసిఆర్ హ అన్ని వర్గాలకు న్యాయం చేశారని అన్నారు గత 10ఏళ్లలో జిఎస్టి వృద్ధిరేంటిలో రాష్ట్రం మూడో స్థానంలో ఉంటే రేవంత్ రెడ్డి 17 నెలల కాలంలో 14వ స్థానం లోకి దిగజారి పోయిందన్నారు 6 గ్యారంటీలు అమలు కావడంలేదని ఆరోపించారు తెలం గాణ కంటే 25 రాష్ట్రాలు ఎక్కువగా అప్పులు చేశాయని చెప్పారు కెసిఆర్ పదేళ్లలో నాలుగు లక్షల కోట్లు అప్పు చేస్తే రేవంత్ ప్రభుత్వం ఏడాదికే రూ1.85 లక్షల అప్పు చేసిందన్నారు.

**బీఆర్ఎస్ పుట్టింది తెలంగాణ ప్రజల కోసం..**

టిఆర్ఎస్ పార్టీ పుట్టింది తెలంగాణ ప్రజల కోసం అన్నారు వరం గల్ సభ కోసం దేశ మొత్తం ఎదురుచూస్తుం దన్నారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20050 ఆర్టీసీ బస్సులను బుక్ చేశామని మరో 20050 ప్రైవేట్ బస్సులను 680 టాక్సులు ఏర్ప ర్తి పీఠం అన్నారు 1260 సొంత కార్యాలు సభకు వెళ్తున్నామని పేర్కొన్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాటా్ల డురూ. జడ్పీ మాజీ చైర్మన్ విట్టల్ మాజీ మేయర్ నీతో కిరణ్. మాజి నోడా చైర్మన్ ప్రభాకర్ యువ నాయకులు జగన్ శిరపరాజు. తదితరులు పాల్గొన్నారు.

## రుణాల మంజూరులో న్యాయం చేయండి

**- విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ శంకర్**

**- బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మల్లయ్య బట్టుకి వినతి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25 (ప్రజా శంఖారావం):**



రుణాల విషయంలో నిజమైన బీసీలకు అత్యంత వెనుకబడిన కులాల లబ్ధిదారులకు న్యాయం చేయండి అంటూ బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టుకి శుక్రవారం తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ వినపత్రం అందించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ రుణాలకు రాజీవ్ యువశక్తి పథకం కింద అనేకమంది బిసి విద్యార్థులు నిరుద్యోగ యువత బిసి కులాల్లో అత్యంత వెనుకబడినటువంటి మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ లోని నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని వీరందరికీ రుణాలు అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. యువకులు ఉన్నత చదువులు చదువుకొని సొంత కాళ్ళ మీద ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో వ్యాపారాలని చేతివృత్తులను అభివృద్ధి చేయడానికి అనేకమంది యువత బిసి కార్పొరేషన్ లోన్లు అప్లై చేసుకున్నారని నీతి నిజాయితీగా పైరవీలకు తావు లేకుండా రాజ కీయాల కతీతంగా నిజమైన లబ్ధిదారులకు నిజంగా యూనిట్లు స్థాపించి బిసి బిడ్డలకు విద్యార్థులకు యువతకు మహిళలకు న్యాయం చేయాలని కోరారు.




# ప్లే ఆఫ్స్ నుంచి సీఎస్కే ఔట్

## చెన్నైలో గెలుపుతో ఎస్ఆర్ హెచ్ ఆశలు సజీవం

ఐపీఎల్ 2025లో ప్లే ఆఫ్స్ అవకాశాలు నిలుపుకోవాలంటే తప్పు గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ అదరగొట్టింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెన్నై సూపర్ కింగ్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కే.. 154 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత ఎస్ఆర్‌హెచ్.. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన రెండో జట్టుగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిలిచింది! చెపాక్ వేదికగా శక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించలేకపోయిన సీఎస్కే.. ఈ టోర్నీలో ఏడో ఓటమిని నమోదు చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌లలో రెండింట్లోనే గెలిచి.. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ టోర్నీలో మూడో విజయం సాధించి.. పాయింట్ల పట్టికలో 8వ స్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. సీఎస్కేకు బ్యాటింగ్ అప్పగించాడు. ఆయుశ్ మాత్రే (19 బంతుల్లో 30 రన్స్) ఔట్ అయ్యాక డివాల్డ్ బ్రేవిస్ (25 బంతుల్లో 42 రన్స్) రాణించడంతో సీఎస్కే.. 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో.. హర్షల్ పటేల్ అత్యధికంగా 4 వికెట్లు తీశాడు. ప్యాట్ కమిన్స్, జయదేవ్ ఉనద్కత్ రెండేసి వికెట్లు.. మహమ్మద్ షమీ 1, కామిందు మెండిస్ 1 వికెట్ పడగొట్టారు.



అనంతరం మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 44 రన్స్), కామిందు మెండిస్ (22 బంతుల్లో 32 రన్స్ నాటౌట్) రాణించారు. నితీశ్ కుమార్ రెడ్డి 13 బంతుల్లో 19 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. సీఎస్కే బౌలర్లలో నూర్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టాడు. ఖలీల్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు.

ఈ మ్యాచ్ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఎస్ఆర్‌హెచ్.. మిగిలిన ఐదు మ్యాచ్‌లలో గెలిస్తే 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్ చేరే అవకాశం ఉంది. ఒక్క దాంట్లో ఓడిన అవకాశాలు సంక్లిష్టం అవుతాయి. అటు 9 మ్యాచ్‌లలో రెండింట్లో గెలిచిన రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు టోర్నీ నుంచి దాదాపుగా నిష్క్రమించాయి. కాగా 12 ఏళ్ల తర్వాత చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడించడం గమనార్హం.

## అరుదైన ఘనత ముంగిట ధోనీ..



భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అరుదైన ఘనత ముందు నిలిచాడు. ఐపీఎల్లో భాగంగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్, సన్ రైజర్స్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ లో సీఎస్కే కెప్టెన్ గా వ్యవహరించబోతున్న ధోనీ.. టీ20 కెరీర్ లో అరుదైన మైలురాయిని చేరుకోనున్నాడు. భారత్ తరపున 400 టీ20 మ్యాచ్ లు ఆడిన నాలుగో క్రికెటర్ గా ధోనీ నిలవనున్నాడు. అందరికంటే అధికంగా, రోహిత్ శర్మ (456), దినేశ్ కార్తీక్ (407), విరాట్ కోహ్లీ (407) మాత్రమే ఇప్పటికి ఈ ఘనత సాధించారు. ఓవరాల్ గా 24వ ప్లేయర్ గా ఈ మైలురాయిని ధోనీ చేరుకోబోతున్నాడు. తన కెరీర్ లో టీమిండియా, సీఎస్కే, రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్, దేశవాళీ జార?ండ్ తరపున వివిధ టీ20 మ్యాచ్ లు ఆడాడు. ఇప్పటివరకు 399 మ్యాచ్ లు ఆడిన ధోనీ 38కిపైగా సగటుతో 7,566 పరుగులు చేశాడు. ఇందులో 28 అర్ధ సెంచరీలు ఉండగా, అత్యధిక స్కోరు 84 నాటౌట్ కావడం విశేషం. అలాగే వికెట్ కీపర్ గా 318 డిస్మిసల్స్ లో పాలు పంచుకోవడం విశేషం. టీమిండియా తరపున ధోనీ దిగ్గజ కెప్టెన్ గా గుర్తింపు పొందాడు. జట్టుకు మూడు ఐసీసీ టైటిల్స్ అందించాడు. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ లను అందించి, ఈ ఘనత సాధించిన తొలి భారత కెప్టెన్ గా నిలిచాడు. ఇక టీ20 ఫార్మాట్లో 5 ఐపీఎల్ టైటిల్స్, రెండు చాంపియన్స్ లీగ్ టైటిళ్లను సాధించాడు. 2008 నుంచి 2023 వరకు సుదీర్ఘంగా సీఎస్కే ను నడిపించిన ధోనీ.. మళ్లీ ఈ సీజన్ లో తప్పనిసరి పరిస్థితుల్లో కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించాడు. దీంతో 43 ఏళ్ల వయసులో కెప్టెన్ గా వ్యవహరించిన ప్లేయర్ గా ఐపీఎల్ రికార్డు నమోదు చేశాడు. ఇక ప్రపంచవ్యాప్తంగా అత్యధిక టీ20లు ఆడిన ప్లేయర్ గా వెస్టిండీస్ గ్రేట్ కీరన్ పొలార్డ్ (695) పేరిట ప్రపంచ రికార్డు ఉంది. అతను ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టు మెంటార్ గా సేవలందిస్తున్నాడు. ఆ తర్వాత స్థానంలో విండీస్ కే చెందిన డ్వేన్ బ్రావో (582), పాకిస్థాన్ ప్లేయర్ షోయబ్ మాలిక్ 9557) పేరు ఉంది. ఇక శుక్రవారం మ్యాచ్ అటు ఎస్ఆర్ హెచ్, ఇటు సీఎస్కేలకు కీలకమైనది కావడం విశేషం. ఈ మ్యాచ్ లో ఓడిన జట్టు దాదాపుగా ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించినట్లే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక చేపాక్ లో ఈ మ్యాచ్ జరుగుతుండటం, ఇక్కడ సన్ రైజర్స్ ఎప్పుడూ గెలిచిన రికార్డు లేకపోవడంతో ఈ మ్యాచ్ లో విజయంపై సీఎస్కే ధీమాగా ఉంది.

## ఆర్సీబీకి సొంతగడ్డపై ఫస్ట్ విక్టరీ

రాజస్థాన్ కు మరోసారి నిరాశ ఎదురైంది. వరుసగా మూడో మ్యాచ్ లోనూ చేతిలోకి వచ్చిన మ్యాచ్ ను, ఒత్తిడికి తట్టుకోలేక ప్రత్యర్థికి అప్పగించింది. దీంతో టోర్నీలో ఏడో పరాజయంతో దాదాపు గా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినట్లే. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో 11 పరుగులతో ఓడిపోయింది. దీంతో సొంతగడ్డ చిన్నస్వామి స్టేడియంలో ఈ సీజన్ లో ఆర్సీబీ తొలి విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 70, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) స్టన్నింగ్ ఫిఫ్టీతో సత్తా చాటాడు. సందీప్ శర్మకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో రాయల్స్ ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు 194 పరుగులు చేసింది. విధ్వంసక ఓపెనర్ యశస్వి జైస్వాల్ సూపర్బ్ హిట్టింగ్ (19 బంతుల్లో 49, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) తో దడదడలాడించాడు. జోష్ హేజిల్ వుడ్ కు నాలుగు వికెట్లు దక్కాయి. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి మాజీ కెప్టెన్ కోహ్లీ చక్కని ఆరంభాన్ని అందించాడు. ముఖ్యంగా మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (26) తో కలిసి శుభారంభాన్ని అందించాడు. ఓ వైపు సాల్ట్ ఆచితూచి ఆడగా, కోహ్లీ మాత్రం సూపర్ టచ్ లో కనిపించి, బౌండరీలు బాదాడు. దీంతో తొలి వికెట్ కు 40 బంతుల్లోనే 61 పరుగుల తుఫాన్ స్టార్ట్ వచ్చింది. ఆ తర్వాత దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 50, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) తో కలిసి కోహ్లీ జట్టును ముందుకు నడిపించాడు. వీరిద్దరూ గేర్లు మార్చడంతో స్కోరు బోర్డు వేగంగా పరుగులెత్తింది. పర్యాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని దూకుడుగా ఆడి, రెండో వికెట్ కు కీలకమైన 95 పరుగులు జోడించారు. ఈ క్రమంలో 32 బంతుల్లో కోహ్లీ ఫిఫ్టీ చేసుకోగా, 26 బంతుల్లోనే పడిక్కల్ అర్ధ సెంచరీ చేసి పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత వేగంగా ఆడే క్రమంలో కోహ్లీ ఔట్ కాగా, తర్వాతి ఓవర్లో పడిక్కల్ పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో ముందుగా బ్యాటింగ్ కు దిగిన టిమ్ డేవిడ్ (23), జితేశ్ శర్మ (20 నాటౌట్) ధనాధన్ ఆటతీరుతో సత్తా చాటడంతో ఆర్సీబీ 200ం పరుగుల మార్కును దాటింది. అనుకున్నదానికంటే ఓ 25 పరుగుల వరకు అదనంగా ఇచ్చిన రాయల్స్.. బ్యాటింగ్ లో మాత్రం దూకుడే మంత్రంగా బరిలోకి దిగింది. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు బౌండరీలు బాదడమే టార్గెట్ గా పెట్టుకున్నారు. ఆరంభంలో వైభవ్ సూర్యవంశీ (16)తో కలిసి జైస్వాల్ వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ బౌండరీలు బాదడంతో తొలి వికెట్ కు 52 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఈ దశలో స్లో బాల్ తో వైభవ్ ను భువనేశ్వర్ కుమార్ బోల్తా కొట్టించాడు. మరో ఎండ్ లో ఏమాత్రం తగ్గని జైస్వాల్ పది బౌండరీలతో దూకుడుగా ఆడాడు. అయితే ఫిఫ్టీకి ఒక్క పరుగు దూరంలో తను ఔటయ్యాడు. ఈ తర్వాత నితీశ్ రాణా (28), కెప్టెన్ రియాన్ పరాగ్ (22) తమకు దక్కిన శుభారంభాలను సద్వినియోగం చేసుకోలేదు. ఓ ఎండ్ లో ధ్రువ్ జురెల్ (47) రెచ్చిపోయినా, షిమ్రాన్ హిట్ మెయర్ (11) మరోసారి విఫలమయ్యాడు. షరామాములుగానే చివరి ఓవర్లో చోక్ చేసిన రాయల్స్.. టోర్నీలో ఏడో పరజాయాన్ని మూటగట్టుకుంది. దీంతో 6వ విజయం సాధించిన ఆర్సీబీ.. పట్టికలో టాప్-3కి చేరుకుంది. మిగతా బౌలర్లలో క్రునాల్ పాండ్యా కి రెండు వికెట్లు దక్కాయి.

## ఆండ్రీ రస్సెల్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం లేదు

### కేకేఆర్ పేలవమైన ప్రదర్శనపై అనిల్ కుంబ్లే

ఐపీఎల్ 2024 టైటిల్‌ను శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ సారి కొత్త కెప్టెన్ అజింక్య రహానే నాయకత్వంలో కేకేఆర్ అద్భుతంగా రాణిస్తుందని ఊహించారు. కానీ ఇది ఇంకా జరగలేదు. కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రదర్శన పేలవంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్?ల్లో కేకేఆర్ 3 మ్యాచ్‌ల్లో గెలిచి 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కేకేఆర్ పేలవమైన ప్రదర్శనపై భారత మాజీ ఆటగాడు అనిల్ కుంబ్లే ప్రశ్నలు లేవనెత్తారు. ఆండ్రీ రస్సెల్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం లేదని కుంబ్లే భావిస్తున్నాడు. జియో హాట్‌స్టార్‌లో అనిల్ కుంబ్లే మాట్లాడుతూ.. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఆండ్రీ రస్సెల్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం తాను భావిస్తున్నానని అన్నాడు. రస్సెల్?ను ముందే బ్యాటింగ్‌కు పంపాలని.. అతనికి మరిన్ని అవకాశాలు రావాలని సూచించాడు. పంజాబ్‌తో కేకేఆర్ ఓడిపోయిన మ్యాచ్ లో కూడా అదే జరిగిందని చెప్పుకొచ్చాడు. ఆ సమయంలో డగౌట్‌లో నిర్ణయం ఇలా ఉండాలని అనిల్ కుంబ్లే చెప్పాడు. రస్సెల్ నువ్వు వెళ్లి త్వరగా ముగించడానికి ప్రయత్నించు.. మొదటి బంతికే నువ్వు ఔటైనా పర్వాలేదు.. మన దగ్గర ఇంకా కొంతమంది బ్యాటర్లు మిగిలి ఉన్నారని ప్రోత్సహించి ఉంటే బాగుండేదని అనిల్ కుంబ్లే పేర్కొన్నాడు. కానీ అది జరగలేదని కుంబ్లే మండిపడ్డాడు.ఆండ్రీ రస్సెల్ బ్యాటింగ్ చేయడానికి వచ్చినప్పుడు అతను బౌలర్లతో కలిసి ఆడవలసి వచ్చిందన్నాడు. చివరి మ్యాచ్‌లో కూడా రస్సెల్ వచ్చే సమయానికి మ్యాచ్ దాదాపుగా ముగిసిందన్నాడు. ఓవర్‌కు 17 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు అవసరం ఉన్న సమయంలో వచ్చాడని చెప్పాడు. ఇది ప్రతిసారీ కాదు.. 10 లేదా 20 మ్యాచ్‌లకు ఒకసారి జరగవచ్చని తెలిపాడు. కాబట్టి కేకేఆర్ దీని గురించి ఆలోచించి ఒక పరిష్కారం కనుగొనవలసి ఉంటుందని తాను భావిస్తున్నట్లు అనిల్ కుంబ్లే స్పష్టం చేశాడు. గత సీజన్‌లో 19 వికెట్లతో పాటు 222 పరుగులు చేసిన రస్సెల్‌ను కేకేఆర్ రూ. 12 కోట్లకు రిటైన్ చేసుకుంది. ఒకప్పుడు ఒంటి చేత్తో మ్యాచ్‌లను గెలిపించిన రస్సెల్.. ఇప్పుడు భారీ షాట్లు ఆడేందుకే తడబడుతున్నాడు. ఈ క్రమంలోనే రస్సెల్ పని అయిపోయిందని, అతన్ని తుది జట్టులో నుంచి తప్పించడం ఉత్తమమని అభిమానులు.. కేకేఆర్‌కు సూచిస్తున్నారు. ఈ సీజన్‌తోనే రస్సెల్ కెరీర్ ముగిసినట్లేనని, వచ్చే సీజన్‌లో అన్‌సోల్డ్‌గా నిలుస్తాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. రస్సెల్ కారణంగా కేకేఆర్‌కు రూ. 12 కోట్ల బొక్క అని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్.. మూడు విజయాలు మాత్రమే నమోదు చేసి పాయింట్స్ టేబుల్‌లో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఈ సీజన్‌లో కేకేఆర్ ఇంకా 6 లీగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కేకేఆర్ ప్లే ఆఫ్స్ చేరాలంటే ఈ 6 మ్యాచ్‌ల్లో ఐదు గెలవాలి. అప్పుడే 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. ఒక్క మ్యాచ్ ఓడినా.. ఇతర జట్ల ఫలితాలు, నెట్‌రన్‌రేట్‌పై ఆధారపడాల్సి ఉంటుంది. మూడు ఓడితే మాత్రం అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది.

## 18వ సీజన్‌లో ఎన్నో రికార్డులు బ్రేక్

ఐపీఎల్ 2025లో సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. దీంతో ప్లే ఆఫ్స్ రేసు తారాస్థాయికి చేరుకుంది. ఈ లీగ్‌లో కొన్నిసార్లు అత్యల్ప స్కోర్లు నమోదవుతుండగా, మరికొన్ని సార్లు ఫోర్లు, సిక్సర్లతో భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. దీంతో రికార్డ్ బ్రేకింగ్ చేధనలు కూడా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో 18వ సీజన్‌లో ఎన్నో రికార్డులు బ్రేక్ అవుతున్నాయి. ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు కూడా నమోదవుతున్నాయి. ఒక ఓవర్‌లో 36 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించవచ్చని అందరికీ తెలిసిందే. కానీ, ఒకే ఓవర్‌లో 36 పరుగులకు రెట్టింపు కంటే ఎక్కువ వచ్చాయని మీకు తెలుసా? అవును, ఓ ఓవర్‌లో 77 పరుగులు వచ్చాయి. ఇందులో 8 ఫోర్లు, 6 సిక్సర్లు వచ్చాయి. ఇది ఓ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో నమోదవ్వడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో కేవలం 2 ఓవర్లలోనే 94 పరుగులు నమోదయ్యాయి. ఇది క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టించింది. ఈ మ్యాచ్ గురించి తెలియాలంటే, 1990 సంవత్సరంలోకి వెళ్లాల్సిందే. క్రైస్ట్‌చర్చ్‌లోని కాంటర్‌బరీ వర్సెస్ వెల్లింగ్టన్ మధ్య ఫస్ట్ క్లాస్ మ్యాచ్ జరిగింది. ఈ షెల్ ట్రోఫీ మ్యాచ్‌లో ఒక అద్భుతం జరిగింది. చివరి రోజున, కాంటర్బరీ గెలవడానికి 2 ఓవర్లలో 95 పరుగులు అవసరం. అంతా ఈ మ్యాచ్ గురించి ఆశ వదులుకున్నారు. కానీ, ఒక్క ఓవర్ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. వెల్లింగ్టన్ బౌలర్ బెర్ట్ వాన్స్ ఒక ఓవర్లో 22 బంతులు వేశాడు. ఇందులో 17 నో బాల్స్ ఉన్నాయి. ఈ ఓవర్‌ను లెక్కించడంలో అంపైర్ కూడా అలసిపోయాడు. ఈ ఓవర్‌లో మొత్తం 77 పరుగులు వచ్చాయి. ఇందులో 8 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. కాంటర్బరీ బ్యాట్స్‌మన్ లీ జర్మన్ 22 బంతుల్లో 70 పరుగులు చేశాడు. చివరి ఓవర్లో జట్టు గెలవడానికి కేవలం 18 పరుగులు మాత్రమే అవసరం. కానీ ఈ ఇద్దరు బ్యాటర్స్ కలిసి 17 పరుగులు చేయగలిగారు. ఈ విధంగా 2 ఓవర్లలో 94 పరుగులు వచ్చాయన్నమాట. ఈ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచిపోయింది.

## వైభవ్ సూర్యవంశీకి సెహ్వాగ్ కీలక సూచనలు

### భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని హెచ్చరిక

భారత క్రికెట్‌లో భవిష్యత్తు తరం ముద్ర వేస్తున్న తరుణంలో, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కుడు వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొన్ని కీలక సూచనలు చేశారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐపీఎల్‌కు పరిచయమైన వైభవ్, తొలి బంతికే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత అవేష్ ఖాన్ వేసిన మొదటి బంతికే మరో సిక్స్ కొట్టి తన ఆటతీరు మీద ప్రత్యేక శైలిని చూపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసి ఆండ్రీ రస్సెల్, కార్లోస్ బ్రాత్‌వైట్ వంటి లెజెండ్స్ సరసన 'ఫస్ట్ బాల్ సిక్స్' ఘనతను సాధించాడు. అయితే సెహ్వాగ్ మాత్రం ఈ శుభారంభాన్ని చూసి అతను మోజులో పడకుండా, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని హెచ్చరించాడు. సెహ్వాగ్ మాట్లాడుతూ, "ఒకటి లేదా రెండు మంచి ఇన్నింగ్స్‌లు ఆడిన వెంటనే చాలా మంది ఆటగాళ్లు తాము స్టార్ అయినట్టు భావిస్తారు. ఆ మోజులో పడి వారు స్థిరపడిపోవడం లేదు. బాగా ఆడినప్పుడు ప్రశంసలు వస్తాయి, కానీ బాగా ఆడకపోతే విమర్శలు వస్తాయి. ఇవన్నీ తెలిసీ, ఏ ఆటగాడైనా మతి తప్పకూడదు," అని అన్నారు. ఆయన సూచన మేరకు, వైభవ్ ఐపీఎల్‌లో 20 సంవత్సరాలు ఆడాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. విరాట్ కోహ్లీని ఉదాహరణగా చూపిస్తూ, "విరాట్ 19 ఏళ్ల వయసులో ఐపీఎల్ ఆడటం ప్రారంభించాడు. ఇప్పుడు అతను 18 సీజన్లు ఆడాడు. అదే తీరులో సూర్యవంశీ కూడా దృష్టిని నిలుపుకోవాలి. కానీ ఒక అరంగేట్ర ఇన్నింగ్స్‌తోనే సంతృప్తి చెందితే, అతన్ని వచ్చే ఏడాది మళ్లీ చూడకపోవచ్చు," అని సెహ్వాగ్ చక్కగా చెప్పారు. కేవలం ?30 లక్షల బేస్ ప్రైస్‌తో లిస్ట్ అయినప్పటికీ, రాజస్థాన్ రాయల్స్ అతనిని రూ.1.10 కోట్లకు కొనుగోలు చేసి ఆశలు పెట్టుకుంది. దీంతో అతను ఐపీఎల్ చరిత్రలో కోటీశ్వరుడైన అతి పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. అయితే, ఈ పేరు నిలబడాలంటే స్థిరమైన ప్రదర్శనలు అవసరం. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 12 బంతుల్లో 16 పరుగులు చేసిన వైభవ్, విజయం అందుకోలేకపోయాడు. 11 పరుగుల తేడాతో జట్టు ఓడిపోయినప్పటికీ, అతని ఆటతీరు గురించి చర్చ సాగుతుంది.

## కొందరితో బంధానికి
# నిర్వచనం ఉండదు

### సమంతతో సినిమా చేస్తానన్న సుధ కొంగర




కొందరితో బంధం బలంగా ఉంటుందని..దానికి నిర్వచనం ఇవ్వలేమని ప్రముఖ నటి సమంత అన్నారు. ఒక్క అంశం ఆధారంగా కెరీర్‌ను నిర్ణయించలేమని సమంత అన్నారు. తాజాగా కోలీవుడ్‌లో నిర్వహించిన గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్‌గా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్‌తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు, రక్తసంబంధీకుడా అని చెప్పలేనని అన్నారు. అభిమానుల గురించి మాట్లాడుతూ.. ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టం. లక్‌తో పాటు- నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానానికి కారణం. దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటు-ందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా డిసైడ్ చేస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసి, తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని సమంత తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకురాలు సుధ కొంగర మాట్లాడుతూ సమంతపై ప్రశంసల వర్షం కురిపించారు.సమంతకు నేను అభిమానిని. 5 సంవత్సరాలుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నాను. ఆమె బాధపడినప్పుడు నాకు కన్నీళ్లు వచ్చేవి. సమంతను చూసి ఎంతోమంది అమ్మాయిలు ధైర్యం తెచ్చుకోవాలి. ఆమెతో సినిమా తీయాలని రెండుసార్లు ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. ఎప్పటికైనా సమంతతో కచ్చితంగా సినిమా తీస్తాను. ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకు చాలా ఇష్టం' అని చెప్పారు. ఈ మాటలకు సమంత స్పందిస్తూ.. తనకు యాక్షన్ ఫిల్మ్ చేయాలనుందని చెప్పారు. కచ్చితంగా యాక్షన్ ఫిల్మ్ చేద్దామని సుధ అన్నారు.




# సారంగపాణి జాతకం బాగుంది !

యువ కథానాయకుడు ప్రియదర్శి వరుస సినిమాలతో మంచి ఫామ్‌లో ఉన్నారు. సున్నితమైన కథలు, స్వచ్ఛమైన హాస్యానికి పెట్టింది పేరు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన కామెడీ ఎంటర్‌టైనర్ 'సారంగపాణి జాతకం'. కుటుబం మొత్తాన్ని థియేటర్‌కి కదిలించేంతగా నవ్వులు ఇందులో పండాయని అంటున్నారు. సారంగపాణి (ప్రియ దర్శి) హ్యుందాయ్ కార్ల కంపెనీలో ఓ సేల్స్‌మేన్. రెండేళ్లుగా బెస్ట్ సేల్స్‌మెన్‌గా కొనసాగు తుంటాడు. అదే కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తుంటుంది మైథిలీ (రూప కొడువాయూర్). ఆమె ప్రేమలో ఉన్న సారంగకి చిన్నప్పటి నుంచీ జాతకాలపై నమ్మకం. ఆ రోజు కూడా అద్భుతమైన రోజు అని తెలిశాకే మైథిలీకి తన ప్రేమ విషయం చెప్పాలని ఆఫీస్‌కి బయల్దేరతాడు. మైథిలీ యేమో నమ్మకాల్ని పట్టించుకోని ఆధునిక భావాలున్న ఓ యువతి. సారంగ తాను ప్రేమిస్తున్న సంగతిని చెప్పేలోపే మైథిలీ తన మనసులో మాటని చెబుతుంది. దాంతో ఆ ఇద్దరి ప్రేమకథ సుఖాంతమవుతుంది. ఇద్దరికీ వివాహం కూడా నిశ్చయమవుతుంది. ఇంతలో ఓ రోజు పబ్‌లో హస్త సాముద్రికుడైన జిగేశ్వరానంద (అవసరాల శ్రీనివాస్)ని కలుస్తాడు సారంగ. చేయి చూసి భవిష్యత్తులో ఓ మర్డర్ చేస్తావని చెబుతాడు. అసలే జాతకాల్ని అతిగా నమ్మే సారంగ... మర్డర్ భయంతో తన పెళ్లిని వాయిదా వేసుకుంటాడు. జాతకంలో ఎలాగూ ఓ మర్డర్ చేస్తానని ఉంది కాబట్టి... పెళ్లికి ముందే ఆ పనిని పూర్తి చేస్తే తర్వాత తన వైవాహిక జీవితానికి ఏ సమస్యలు రావు కదాని ఓ నిర్ణయానికొస్తాడు. తన చిన్ననాటి మిత్రుడు, తనతోపాటే పనిచేసే చందు (వెన్నెల కిశోర్)తో కలిసి మర్డర్‌కి వ్యూహం పన్నుతారు. వీళ్లు హత్య చేయాలనుకున్న అహోబిల రావు (తనికెళ్ళ భరణి) ఎవరు? అతన్ని హత్య చేశారా లేదా? తదితర విషయాలు సినిమా కథలో భాగంగా వచ్చేవి. కథతో నవ్వించే సినిమాలు తెలుగులో వచ్చి చాలా కాలమైంది. కామెడీ అంటే లాజిక్ లేని సన్నివేశాలు, ద్వంద్వార్థాలతో కూడిన సంభాషణలేనేమో.. అలా కాకుండా ప్రేక్షకుల్ని నవ్వించడం కష్టమేమో అన్నట్టుగా ఈ మధ్య సినిమాలు వస్తున్నాయి. అందుకు భిన్నంగా కథ నుంచే స్వచ్ఛమైన వినోదం పుట్టించే ప్రయత్నం చేశారు. ఇందులోనూ క్రేజీగా వ్యవహరించే పాత్రలు, సిల్లీగా అనిపించే సన్నివేశాలు ఉన్నా అవన్నీ కథలో భాగంగానే వస్తుంటాయి. అతిగా నమ్మడంతో ఎన్ని అనర్థాలో చెప్పే ఈ కథకి దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మార్క్ రచన ప్రధానబలం. నేపథ్యం కొత్తదేమీ కాకపోయినా, కథ, కథనాలు ఊహకందినా సినిమాలో హాస్యంపాళ్లు మాత్రం ఎక్కడా తగ్గవు. శ్రీనివాస్ అవసరాల రాకతో సినిమా గమనం మారిపోతుంది. జాతకంలో ఉన్న మర్డర్‌ని పెళ్లికి ముందే చేయాలని ప్రియదర్శి, వెన్నెల కిశోర్ ఓ నిర్ణయానికి వచ్చే సన్నివేశాల నుంచి థియేటర్‌లో అసలు సిసలు సందడి మొదలవుతుంది. అక్కడి నుంచి వీళ్లు హత్య చేసేందుకు ఎంచుకునే వ్యక్తులు, అక్కడ వ్యూహాల్ని అమలు చేసేందుకు పడే పాట్లు, ఆ సందర్భంలో పండే హాస్యం సినిమాకి హైలైట్. ముఖ్యంగా బామ్మ ఎపిసోడ్ ఆకట్టుకుంటుంది. ద్వితీయార్థంలో హీరోహీరోయిన్ల మధ్య దూరం పెంచి, ఆ నేపథ్యంలో సంఘర్షణని ఆవిష్కరిస్తారేమో అని ఆశించగా, దర్శకుడు మళ్లీ కామెడీ కోణంలోనే కథని మలుపు తిప్పాడు. ప్రియదర్శి, వెన్నెల కిశోర్‌కి వైవా హర్షతోపాటు- మరికొన్ని కొత్త పాత్రలు తోడవడంతో మరిన్ని నవ్వులు పండుతాయి. కథ విశాఖపట్నంలోని హోటల్‌కి చేరాక సన్నివేశాలన్నీ అక్కడక్కడే తిరుగుతుంటాయి. పాత్రలన్నింటినీ ఒక చోటకి చేర్చి నవ్వులు రాబట్టడం, కథని ముగించిన తీరు బాగుంది. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెలుగుదనానికి పెద్దపీట వేస్తారు. ఇందులో అచ్చ తెలుగు సంభాషణలు, ప్రాసలు, పదప్రయోగాలు చాలానే ఉన్నాయి. అదే సమయంలో ఆంగ్ల సంభాషణలు కూడా ఎక్కువగా వినిపిస్తాయి.



## సూర్యతో మరోమారు జతకట్టబోతున్న కీర్తి

కీర్తి సురేష్..పేరు చెబితే మహానటి సినిమానే గుర్తుకు వస్తుంది. మూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటు-న్న ఈ ముద్దుగుమ్మ.. కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. మొదట్లో పద్ధతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత అమ్మడు గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది. గత సంవత్సరం అట్లీ- నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందిట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోంది సార్, లక్కీ బాస్కర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట. సూర్యా 46వ

సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన అమ్మడి ఫేట్ మారుతుందా చూడాలి.




## హిట్-3
## పెద్దలకు మాత్రమే

నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సినిమా హిట్ 3. విడుదలకు సిద్దంగా ఉంది. యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నానిని ఇప్పటి వరకు చూడని కొత్త యాంగిల్‌లో చూడబోతున్నాం. ఆ మధ్య రిలీజ్ అయిన టీజర్ తో ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ చుస్తే ఈసారి వైలెన్స్‌కే వణుకు పుట్టించేలా ఉన్నాడు నాని. దసరా, సరిపోదా శనివారం లాంటి మాస్ సినిమాలు చేసినప్పటికీ హిట్ 3తో ఊహించని ఊచకోతకు రెడీ అవుతున్నాడు నాని. కాగా హిట్ 3 వరల్డ్ వైడ్ గా మే 1న రిలీజ్ కానుంది. రిలీజ్ కు వారం మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు మేకర్స్. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న హిట్ 3 కు సెన్సార్ సభ్యులు ఎ సర్టిఫికెట్ అందించారు. సినిమాలో హింస, రక్తపాతం, వైలెన్స్ ఎక్కువగా ఉందని 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసారు. 13 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న వారికి అనుమతి లేదని చిన్న పిల్లలు ఈ సినిమాకు దూరంగా ఉండాలని సూచించింది. నాని స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్న సినిమా కావడంతో ప్రమోషన్స్ ను భారీ ఎత్తున జెట్ స్పీడ్ లో చేస్తున్నాడు నాని. ఈ హిట్ సిరీస్ లోని తోలి రెండు బాగాలు హిట్ కావడంతో పాటు- నేచురల్ స్టార్ మోస్ట్ వాయిలెంట్

గా కనిపిస్తుండడం సినిమాకు గ్రాండ్ ఓపెనింగ్ తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టు-కున్నారు. మరి అంచనాలు హిట్ 3 ఏ మాత్రం అందుకుంటదో మరోక వారం రోజుల్లో తెలుస్తుంది.

## మరోమారు రజనీ సార్‌తో
# ఫహాద్ స్క్రీన్ షేర్



మలయాళ నటుడే అయినా సౌత్‌లో సూపర్బ్ పాపులారిటీ తెచ్చుకున్నాడు ఫహాద్ ఫాజిల్. 'పార్టీ లేదా పుష్పా' అనే డైలాగ్‌తో తెలుగులో తన ఇమేజ్‌ను మరింత పెంచుకున్నాడు. అలాగే పలువురు స్టార్ హీరోల చిత్రాల్లో నటించి తనదైన యాక్టింగ్‌తో మెస్మరైజ్ చేసిన ఫహాద్.. ఓ క్రేజీ కాంబోను రిపీట్ చేయబోతున్నాడట. ఇప్పటికే సూపర్ స్టార్ రజినీకాంత్ 'వేట్టయాన్'లో కీలక పాత్ర పోషించిన ఫహాద్.. మరోసారి రజినీతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్టు- తెలుస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందిస్తున్న 'జైలర్ 2'లో ఓ ఇంపార్టెరట్ రోల్ కోసం ఫహాద్‌ను సంప్రదించగా, తను గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. త్వరలోనే ఈ క్రేజీ కాంబోపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 'వేట్టయాన్'లో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలవగా, 'జైలర్ 2' చిత్రంపైనా అంచనాలు ఏర్పడ్డాయి. అలాగే 'జైలర్'లో అతిథి పాత్రలు పోషించిన మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్‌లు ఇందులోనూ కొనసాగుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PUTTI MURALI**, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE,PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : **PUTTI MURALI**, TELTEL/2022/85170, EMAIL : prajashankaravam@gmail.com